మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించండి. షేర్, సబ్‌స్క్రైబ్, లైక్.

https://www.sreechakranews.com

శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 95 | కర్నూలు | శనివారం 16-05-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

దేశం గర్వించేలా పుట్టపర్తి అభివృద్ధి

రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్
ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారింది
జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి
అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన
దేశ అభివృద్ధిలో ఇక ఎపి కీలక భూమి అన్న చంద్రబాబు

పుట్టపర్తి,మే15(శ్రీచక్ర) : దేశం గర్వించే రక్షణ కేంద్రంగా పుట్టపర్తి తయారుకాబోతందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. పుట్టపర్తి అనగానే సత్యసాయిబాబా గుర్తొస్తారు. తన బోధనలతో విశ్వశాంతికి కృషి చేశారు.రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్ అని.. ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారిందన్నారు. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్ గుర్తొచ్చేదని.. ఇకపై జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ అని చెప్పుకుంటారని తెలిపారు. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 1,500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామన్నారు. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ నిలవ నుందని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ భారతీయులకు గర్వకారణం. ఇప్పుడు అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు రావడం ఎంతో కీలకమన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి ఈ ప్రాజెక్టు దోహదపడనుతుందన్నారు. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటడంలో ఆపరేషన్ సిందూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని సీఎం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారు చేసి పరీక్షించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు పైలట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధి చెందుతుందన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ఈ కీలక ప్రాజెక్టుతో మరిన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్‌సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌తో కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంక క్షిపణి శక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికి అండగా నిలుస్తుందని సీఎం అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభిస్తామని ప్రకటించారు. 2028 నాటికి కడప వూర్తిచేస్తామన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమకు నీరిచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ ద్వారా భారతదేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకో సిస్టమ్‌కు శ్రీకారం చుట్టాం. రూ.686 కోట్లతో 8 సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయి. వీటి ద్వారా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒకప్పుడు రాయలసీమ అంటే రతనాల సీమ. ఒకానోక దశలో అనంతపురం ఎడారిగా మారిపోయింది. రాయలసీమ రూపు రేఖలు పూర్తిగా మార్చిన ఘనత ఎన్టీఆర్‌ది. సీమకు నీళ్లు తీసుకురావాలి, ప్రజల జీవితాలను మార్చాలని ఎన్టీఆర్ సంకల్పించారు. ఆయన శ్రీకారం చుట్టిన ప్రాజెక్టులను

పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో సీమకు జలహారతి ఇచ్చాం. కేంద్రం సహకారంతో రాయలసీమ రూపు రేఖలు మారబోతున్నాయి. రాయలసీమను మళ్లీ రతనాలసీమ చేసే బాధ్యతను ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది. కడప స్టీల్‌ప్లాంట్ పనులు జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి నిర్మాణం పూర్తి చేసి రాయలసీమకు కానుకగా ఇస్తాం. దేశానికి ఏపీ రక్షణకవచంగా నిలబడుతోంది. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్.. ఇప్పుడు జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 600 కిలోలు, వచ్చే ఏడాది 1500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తాం.

రక్షణ రంగంలో భారత్ బలోపేతం

ఏపీ ప్రధాన కేంద్రంగా మారుతోంది

ఎక్స్ వేదికగా చంద్రబాబు వెల్లడి

పుట్టపర్తి,మే15(శ్రీచక్ర) రాయలసీమ లక్ష్యాలను చేరడమే కాదని.. లక్ష్యాలను ఛేదిస్తోందంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రక్షణ రంగంలో భారత్ బలోపేతానికి ఏపీ ప్రధాన కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చేపడుతున్న ప్రోగ్రామ్ ఫెసిలిటీ కేంద్రం రాయలసీమ అభివృద్ధిలో మరో కీలక మైలురాయి అని అభివర్ణించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి ఈరోజు ఏఎంసీఏ ప్రాజెక్టు శంకుస్థాపనకు హాజరయ్యానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో స్వదేశీ రక్షణ సాంకేతికతల్లో భారత్ వేగంగా ముందుకు వెళ్తోందని ఉద్ఘాటించారు. స్టెల్త్ సిస్టమ్స్, అడ్వాన్స్‌డ్ అవియానిక్స్, సమగ్ర యుద్ధ విమాన సాంకేతికతలో ఏఎంసీఏ ప్రోగ్రామ్ కీలకమని వ్యాఖ్యానించారు. ఈరోజు రాయలసీమలో కీలక రక్షణ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో 9 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని వెల్లడించారు. వ్యూహాత్మక తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్

రక్షణ రంగంలో భారత్ స్వావలంబన దిశగా పురోగతి

పుట్టపర్తి పర్యటనలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

పుట్టపర్తి,మే15(శ్రీచక్ర) : యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల్లో డ్రోన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏపీలో రూ.480 కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రారంభిస్తున్నామని చెప్పుకొచ్చారు. శుక్రవారం పుట్టపర్తిలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం చంద్రబాబు పర్యటించారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తి – కోడూరు రోడ్డులోని 130 ఎకరాల విస్తీర్ణంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఆయుధ ఉత్పత్తిలో స్వావలంబన దిశగా భారత్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. రక్షణ శాఖలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనేది కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అంతరం తగ్గించడానికి కృషి

చేస్తున్నామని చెప్పుకొచ్చారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు చేయిచేయి కలిపి నడుస్తున్నాయని తెలిపారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని తగ్గించామన్నారు. 'యుద్ధ రంగంలో డ్రోన్ టెక్నాలజీ ఒకగేమ్ ఛేంజర్‌గా నిలిచింది. 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో డ్రోన్ సిటీ ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇక నుంచి కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారు. ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంలో కూడా డ్రోన్ పాత్ర కీలకంగా మారింది. హెచ్ఎఫ్‌సీఎల్ రూ.1294 కోట్ల పెట్టుబడితో రాబోతోంది. ఆయుధాల తయారీ రంగంలో స్వావలంబన దిశగా కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. యుద్ధసమయంలో సొంత భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. కొన్నేళ్ల క్రితం రక్షణరంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు మారాయి.. గత పదేళ్లుగా చేసిన కఠోర శ్రమకు ఫలితాలు వస్తున్నాయి.

ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు

ప్రధాని మోడీకి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు

అమరావతి,మే15(శ్రీచక్ర) శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. పుట్టపర్తిలో రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 7,500 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏఎంసీఏ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు. 'రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఇది ఒక కీలకమైన మైలురాయి. రూ.15,800 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాలలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ / ఫ్లైట్ టెస్ట్ సెంటర్‌తో పాటు ప్రధాన రక్షణ, డ్రోన్ ఎకోసిస్టమ్ ప్రాజెక్టులను స్థాపించడం అనేది, నవకల్పన ఆధారిత వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు. సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు, 7,500కు పైగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని అంచనా. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. భారతదేశ వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను బలోపేతం చేయడానికి నిరంతరం మద్దతు ఇస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్... పారిశ్రామిక వృద్ధి, ఆవిష్కరణలు, భవిష్యత్తు – సిద్ధ పెట్టుబడుల కోసం తన దార్శనికతను బలోపేతం చేస్తూనే ఉంది' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

ప్రశాంతి నిలయం దర్శించుకున్న లోకేశ్

పుట్టపర్తి,మే15((శ్రీచక్ర) శ్రీ సత్యసాయి జిల్లాలో మంత్రి నారా లోకేశ్ రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని మంత్రి సందర్శించారు. ప్రశాంతి నిలయంలో లోకేశ్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం సాయి కుల్వంత్ మందిరంలోని శ్రీ భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ స్టేట్ మీడియా కోఆర్డినేట్ రాష్ట్ర కార్యదర్శి బి.వి రాముడు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్(ఏఎంసీఏ) తయారీ కేంద్రానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొననున్నారు. ఏఎంసీఏ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్, ఏరోనాటికల్ డెవలప్ మెంట్ ఏజెన్సీ, ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. రూ.15,803 కోట్లతో ఏఎమ్‌సీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనుంది. దీంతో 7,500 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నారు.

మహానాడుపై టీడీపీ కీలక నిర్ణయం..

మంగళగిరిలో హైబ్రిడ్ విధానంలో నిర్వహణ

అమరావతి, మే 15(శ్రీచక్ర) : తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడుపై హై కమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా నెల్లూరులో మూడు రోజుల పాటు నిర్వహించాలని భావించిన మహానాడును ఇప్పుడు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

రెండు రోజుల పాటు మహానాడు..

ఈ మేరకు మే 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు మహానాడు కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో పరిమిత సంఖ్యలో నేతలు ప్రత్యక్షంగా పాల్గొనగా, జిల్లాలు, నియోజకవర్గాలు, క్లస్టర్ల స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వర్చువల్ విధానంలో హాజరుకానున్నారు. మంగళగిరిలో జరిగే మహానాడుకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులు, అధికార ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రత్యక్షంగా హాజరవుతారు. అలాగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపీలు, ముఖ్య నాయకులు తమ తమ నియోజకవర్గాల నుంచి ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో పాల్గొంటారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

పార్టీకి చెందిన 1848 క్లస్టర్ల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు కూడా ఆయా క్లస్టర్ల నుంచే వర్చువల్‌గా మహానాడులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఒకేసారి మహానాడును వీక్షించేలా

సాంకేతిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా మహానాడులో ప్రవేశపెట్టే రాజకీయ, ఆర్థిక, సంక్షేమ తీర్మానాలు సహా అన్ని కార్యక్రమాలు సంప్రదాయ మహానాడు తరహాలోనే నిర్వహించనున్నట్లు టీడీనీ నేతలు వెల్లడించారు. తీర్మానాల ఆమోదం, నాయకుల ప్రసంగాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు అన్నీ హైబ్రిడ్ మోడల్‌లో కొనసాగనున్నాయి.

హైబ్రిడ్ విధానంపై ఆసక్తి..

పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ విధానాలపై చర్చ, భవిష్యత్తు రాజకీయ వ్యూహాల రూపకల్పన వంటి అంశాలు ఈ మహానాడులో ప్రధాన అజెండాగా ఉండనున్నాయి. భారీ జన సమీకరణకు బదులుగా సాంకేతికతను వినియోగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులను అనుసంధానించే విధంగా ఈసారి మహానాడును నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ చరిత్రలో హైబ్రిడ్ విధానంలో మహానాడు నిర్వహణకు తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

సంపాదకీయం

ఎన్నాళ్లో లీకులు...

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహారాష్ట్రలోని నాసిక్ వైద్యుడు డాక్టర్ శుభం ను సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. విచారిస్తున్న క్రమంలో దారుణమైన నిజాలు బయటపడుతున్నాయి. శుభం వైద్యుడిగా కొనసాగుతున్నాడు. కానీ ఒక్కరోజు కూడా మెడికల్ కాలేజీకి వెళ్లలేదు. ఇతడి స్వస్థలం నందగావ్. ఇతడు నాసిక్ ప్రాంతంలో కోచింగ్ కారిడార్ ప్రాంతంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. దాని నేమ్ బోర్డు లో శుభం పేరు ముందు డాక్టర్ అని రాసి ఉంటుంది. స్థానికంగా అతడు తనను తాను డాక్టర్గా పరిచయం చేసుకున్నాడు. అంతేకాదు ఎంబిబిఎస్, బిడిఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ కోర్సులలో అడ్మిషన్ల కోసం ప్రయత్నాల సాగించే విద్యార్థులకు అతడు సలహాలు ఇస్తుంటాడు. 2021లో భోపాల్ సమీపంలోని సత్యసాయి యూనివర్సిటీలో బ్యాచ్లర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సు ఇతడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే పోలీసులు విచారణలో ఆ యూనివర్సిటీ వీసీని సంప్రదించారు. అప్పుడు అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం అడ్మిషన్ సమయంలోనే శుభం యూనివర్సిటీ కి వెళ్ళాడు. ఆ తర్వాత తరగతులకు హాజరు కాలేదు.నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం ముందుగా రాజస్థాన్లో వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత విచారణ జరుగుతున్న కొద్ది అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పేపర్ను శుభం పదిలక్షలకు కొనుగోలు చేశాడు. కొరియర్ లో ప్రశ్నపత్రం వస్తే.. దానిని పిడిఎఫ్ లాగా మార్చాడు. ఆ తర్వాత దానిని గురుగ్రామ్ ప్రాంతంలో ఒక వ్యక్తికి 15 లక్షలకు అమ్మాడు. ఈ పేపర్ మొత్తం అనేక రాష్ట్రాలను చుట్టింది. పలువురు విద్యార్థులు రెండు నుంచి ఐదు లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. అయితే క్వశ్చన్ పేపర్ లీకేజీ బయటపడడంతో.. శుభం పరారీ లో ఉన్నాడు. తర్వాత తనను ఎవరు గుర్తుపట్టకుండా ఉండడానికి గుండు చేయించుకున్నాడు. అయితే పోలీసులు డిజిటల్ ఆధారాలు సేకరించి అతడిని అరెస్ట్ చేశారు. శుభం సోదరుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ అనేది ఈ పరీక్ష రాసిన విద్యార్థుల గుండెల్లో దిగి న బాకు మాత్రమే కాదు, లక్షలాది జీవితా ల్లో ఒక్కసారిగా వెలుగు ఆరిపోవడం లాంటి ది కూడా. నెలల తరబడి కాదు, ఏళ్లుగా నిద్ర మానేసి, ఫోన్లు దూరం పెట్టి, పండుగలు వదిలేసి, తమ యౌవనాన్ని ప్రశ్నాపత్రాల మధ్య బంధించిన పిల్లలకు పరీక్ష రద్దు అనే రెండు మాటలు వార్తలా వినిపించవు. అవి గుండెలమీద వడే బరువులా అనిపిస్తాయి.పాపం, పుణ్యం తెలియకుండా కష్టాన్ని మా త్రమే నమ్ముకొని ఈసారి బాగా రాశామని, మంచి ర్యాంకు వస్తుందని ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఇప్పుడు మళ్లీ సందిగ్ధంలో పడ్డారు. విద్యార్థుల కంటే ఎక్కువగా వారి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. పైసా పైసా కూడబెట్టి పిల్లలను చదివించారు. కొందరు బంగారం అమ్మారు. మరికొందరు పొలాలు తాకట్టు పెట్టారు.మధ్యతరగతి కుటుంబాల్లో డాక్టర్ అవ్వాలనే కల ఒక వృత్తిపై ఆశ మా త్రమే కాదు. అది ఒక తరాన్నే మార్చే ఆశయం. ఇప్పుడు వారిని వెంటాడుతున్నది పరీక్ష రద్దయిందనే బాధ మాత్రమే కాదు, మళ్లీ అదే స్థాయిలో రాయగలమా? అనే భయం కూడా. ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే కావచ్చు. కానీ, ఒకసారి విరి గిపోయిన మనసును తిరిగి అదే ధైర్యంతో నిలబెట్టడం అంత సులభం కాదు.పేపర్ లీక్ అయిందని, నిర్వహణలో లో పాలు జరిగాయని, అవకతవకలపై అనుమానాలు వచ్చాయని అధికారిక కారణాలు విని పించవచ్చు. కానీ, ఇక్కడ అసలు ప్రశ్న ఇం కొకటి ఉంది. దేశంలో అత్యంత కీలకమైన పరీక్షలలో ఒకటైన నీట్ను కూడా నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించలేకపోతే వి ద్యార్థులు ఇంకేం నమ్మాలి? పరీక్షల మీద నమ్మకం కూలిపోవడమనేది కేవలం విద్యావ్యవస్థ సమస్య కాదు. అది సమాజ నైతికత కదలిపోతున్నదని చెప్పడానికి సంకేతం.ఎందుకంటే పరీక్షలు కేవలం మార్కులు ఇ వ్వవు. నువ్వు కష్టపడితే ముందుకు వెళ్లగలవనే విశ్వాసాన్ని కూడా ఇస్తాయి. ఇప్పుడు అ దే విశ్వాసం ముక్కలవుతోంది. దేశవ్యాప్తం గా ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు నీట్ రాస్తున్నారు. వారిలో చాలా మంది సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. వాళ్లకు ప్రతిభ ఒక్కటే మూలధనం.కానీ, ఇప్పుడు ఎక్కడో, ఎవరో వ్యవస్థను మోసం చేస్తే తన కష్టం వృథా అవుతుందా? అనే భయం పెరుగుతోంది. ఇది ఏ విద్యార్థికైనా అత్యంత ప్రమాదకరమైన మానసిక స్థి తి. ఎందుకంటే ఆశ కోల్పోయిన యువత ఇ చ్చే నిశ్శబ్దం కన్నా భయంకరమైనది మరొకటి ఉండదు.నీట్ చుట్టూ ఇప్పుడు మరో పెద్ద ప్రశ్న నిలుస్తోంది. కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును ఒకే రోజు, ఒకే పరీక్షతో నిర్ణయించడం నిజంగా న్యాయమేనా? ఒక గ్రామంలో తె లుగు మీడియంలో చదివిన విద్యార్థి, అత్యం త ఖరీదైన కోచింగ్ తీసుకున్న నగర విద్యార్థితో ఒకేస్థాయిలో పోటీ పడుతున్నాడని చెప్పడం సులభం. కానీ, వాస్తవ పరిస్థితులు అంత సమానంగా లేవు. ఒకరికి టెస్ట్ సిరీస్లు, ప్రత్యేక శిక్షణ, డిజిటల్ సదుపాయా లు ఉంటే, మరొకరికి కనీసం సరైన విద్యుత్ సదుపాయం కూడా ఉండకపోవచ్చు.అయినా ఇద్దరికీ ఒకే మెరిట్ కొలమానం వర్తింపజేయడం నిజంగా సమానత్వమేనా? మెరిట్ అనే పదం వినడానికి గొప్పగా ఉంటుంది. కానీ ఆ మెరిట్ వెనుక కుటుంబ పరిస్థితి ఏమిటి? ఆర్థిక స్థితి ఏమిటి? అవకాశాలు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి? అనే ప్రశ్నలూ ఉంటాయి. కొందరు కార్పొరేట్ కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి సిద్ధమవుతుంటే, మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వనరుల మధ్య చదువుతు న్నారు. పరీక్ష అందరికీ ఒకటే కావచ్చు. కానీ, అవకాశాలు మాత్రం అందరికీ ఒకేలా లేవు.నీట్ వంటి పరీక్షలు వచ్చిన తర్వాత విద్య అంటే జ్ఞానం అనే భావన క్రమంగా బలహీనపడుతోంది.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయి పీజీఆర్ఎస్ నిర్వహణ:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, మే, 15 (శ్రీచక్ర): ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో పీజీఆర్ఎస్ ను నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. శుక్రవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ కాన్ఫరెన్స్లో ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి శుక్రవారం నియోజక వర్గ స్థాయి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే ఈరోజు మొదటగా పాణ్యం నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారని, ఇది జిల్లా పరిపాలనపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. అయితే మండల స్థాయిలోనే పరిష్కరించాల్సిన అనేక సమస్యలు జిల్లా స్థాయికి వస్తున్న నేపథ్యంలో ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో నియోజకవర్గ స్థాయిలోనే ఈ ప్రత్యేక గ్రీవెన్స్ వ్యవస్థను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చే అవసరం లేకుండా ఈ కార్యక్రమం దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలను స్థానికంగానే వేగంగా పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ఒకవేళ సమస్య పరిష్కారం అయ్యే అవకాశం లేకపోతే ఎందుకు సాధ్యం కాదో స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఇలా పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రజలు తరచూ "అధికారులు స్పందించడం లేదు", "అధికారులు అందుబాటులో లేరు" అనే ఫిర్యాదులు రాకుండా ప్రజలకు అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సూచించారు. సమస్య పరిష్కారం అవుతుందా లేదా, కాకపోతే ఎందుకు సాధ్యం కాదనే విషయాలను స్పష్టంగా వివరించాలని తెలిపారు. అలా చేయడం ద్వారా మధ్యవర్తుల చేత మోసపోయే ఘటనలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. కొన్ని సమస్యలు జిల్లా స్థాయిలోనే పరిష్కరించగలమని, మరికొన్ని సమస్యలు పై స్థాయిలో ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, వంతెనలు, భారీ ఆర్థిక వ్యయంతో కూడిన అభివృద్ధి పనులు వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బడ్జెట్ మంజూరు అయిన వెంటనే అమలు చేస్తామని చెప్పారు. అందువల్ల ప్రజల సమస్యలపై అధికారులు స్పష్టతతో స్పందించాలని, "ఎందుకు సాధ్యం కాదు" అనే విషయాన్ని కూడా బాధ్యతగా వివరించాలని కలెక్టర్ సూచించారు. ×ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపడమే లక్ష్యం ? నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్ఎస్ నిర్వహణకు సీఎం ప్రత్యేక దృష్టి×పాణ్యం నియోజకవర్గం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డిఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ? ప్రతి సోమవారం కలెక్టరేట్ మరియు మండల స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో నాలుగు వారాల పాటు నిర్వహించి ప్రజలకు మంచి పరిపాలన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అందులో భాగంగా జిల్లాలో మొట్టమొదటిసారిగా పాణ్యం నియోజకవర్గాన్ని ఎంపిక చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ గారికి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, "ఎన్ని సమస్యలు వచ్చాయి?" అని కాకుండా "ఎన్ని సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యాయి?" అనే అంశంపైనే ప్రభుత్వం సమీక్ష చేస్తోందన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో 70 నుంచి 75 శాతం సమస్యలు పరిష్కారం అయినప్పటికీ మిగిలిన 25 శాతం ఎందుకు పరిష్కారం కాలేదని ముఖ్యమంత్రి స్వయంగా ఆరా తీస్తున్నారని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలనే లక్ష్యంతోనే నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 300కు పైగా అర్జీలు అందాయని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. కాలనీలు, డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, పెన్షన్లు, రెవెన్యూ మరియు ఆన్లైన్ నమోదు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే శుక్రవారం కూడా ఇదే విధంగా పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్.డి. వో (ఇంచార్జి) అనురాధ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేసు జెడ్పి సీఈఓ రమణారెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

అంగన్వాడీ కేంద్రాల నుండి 1వ తరగతిలో చేరికల కోసం డోర్-టు-డోర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి×జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మే 15 (శ్రీచక్ర): ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మండల విద్యాశాఖ అధికారులను, హెడ్ మాస్టర్ లను ఆదేశించారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థుల నమోదు అంశం పై మండల విద్యాశాఖ అధికారులతో, హెడ్ మాస్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1 నుండి 10వ తరగతి వరకు విద్యార్థుల నమోదును పెంచడానికి లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, వాటిని సాధించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల నుండి 1వ తరగతికి, అలాగే 5వ తరగతి నుండి 6వ తరగతికి విద్యార్థుల మార్పిడి ఆశించిన స్థాయిలో లేదన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఈ విషయంలో పురోగతి తీసుకొని రావాలన్నారు..అంగన్వాడీ కేంద్రాల నుండి 1వ తరగతిలో విద్యార్థుల చేరికలు పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయులు స్వయంగా ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని వివరించి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమర్థవంతంగా బోధిస్తున్నారని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలే అంగీకరిస్తున్నాయని, ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. కాబట్టి, ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొని నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 1 నుండి 10వ తరగతి వరకు నమోదు 2,55,000 ఉంటే, ఈసారి 10% పెంచి 2,81,000 లక్ష్యంగా ఇచ్చారన్నారు. అందులో భాగంగా ఇప్పటికే 2,36,000 వరకు సాధించాం అన్నారు. ఇంకా 45,000 నమోదు చేయాల్సి ఉందన్నారు. 45,000 లో తరగతుల వారీగా మార్పును (ఠతీజీనిబతిబితినీని) గమనిస్తే, 5వ తరగతి నుండి 6వ తరగతికి వెళ్లే దగ్గర ఎక్కువ గ్యాప్ కనిపిస్తోందన్నారు. మిగిలిన తరగతుల్లో 80% నుండి 90% వరకు సాధించినప్పటికీ, 5 నుండి 6వ తరగతికి మాత్రం కేవలం 56% మాత్రమే సాధించగలిగాం అన్నారు. అంటే 17,595 మందిని 5 నుండి 6వ తరగతికి పంపాము, ఇంకా 13,510 మంది మిగిలిపోయారన్నారు. పెండింగ్ బ్యాలెన్స్ను పూర్తి చేయాలంటే, ప్రైమరీ టీచర్లు ప్రతి విద్యార్థి యొక్క ఖఇఐ (ఖవతీఎజీనివనిబి ఇనితీనీశ్రీశ్రీఎవనిబి ఐబీఎఎవతీ) మరియు ఆధార్ వివరాలను అందించాలన్నారు. ఓఖా లందరూ ఈ విషయంలో శ్రద్ధ వహించి, ఈ ప్రక్రియను ఈరోజు లోపే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఈఓ సుధాకర్, డిప్యూటీ డిఈఓ లు, మండల విద్యాశాఖ అధికారులు, హెడ్ మాస్టర్ లు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ నెంబర్ గా ఎన్నికైనటువంటి మాల గడ్డం ముత్యాలప్ప

అనంతపురం జిల్లా మే 15 అనంతపురంలో ఉంటున్నటువంటి గడ్డం ఎస్సీ ఎస్టీ గుర్తించినందుకు గర్వంగా ఉందని కొనియాడినారు ముత్యాలప్ప మాట్లాడుతూ అనంతపురం మాలలకు సేవ చేసే భాగ్యాన్ని నాకు కల్పించినాడని కొనియాడినారు మాలల హక్కులకు పోరాడిన ఉద్యమ నేత మాల మహానాడు అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ బాబు గారి నేతృత్వంలో జిల్లాలోని మాలల సమస్యలను పరిష్కరించడానికి హక్కుల సాధనకు కృషి చేసినందుకు ప్రభుత్వం గుర్తించి అనంతపురం ఎస్సీ, ఎస్టీలకు సహాయము చేసే భాగ్యాన్ని నాకు దక్కినదని చెప్పుకోవచ్చు నాకు మాలల కుటుంబములు చూడాలని ఆశని కొనియాడినారు ముత్యాలప్ప చిన్ననాటి నుండి మాలల కోసము ఉద్యమాలు, పోరాటాలు చేసిన వ్యక్తి ఏ చిన్న కష్టం వచ్చినా ఆ కష్టాన్ని నా కుటుంబ సమస్యగా భావించి వారికి సహాయం చేసే మనసు హృదయము ఉన్నటువంటి వ్యక్తి మాలలంటే అపారమైనటువంటి గౌరవంతో నిండినటువంటి వ్యక్తి అని చెప్పుకోవచ్చు సామాజిక సేవ పట్ల అంకితభావంతో ఉండి సేవ చేస్తానని పేర్కొన్నాడు అనంతపురం జిల్లాలో ఉన్నటువంటి మాల సోదరులందరూ కూడా సంతోషాన్ని వ్యక్తపరిచినారు కార్యక్రమంలో పాల్గొన్నటువంటి మాల కోళ్ల రమేష్ మాల సోదరులు పాల్గొన్నారు

క్రమశిక్షణ లేకపోతే ఇంటికే..!

మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక
పిన్ పాయింట్ ప్రోగ్రామ్ పక్కాగా అమలు చేయాలి

కర్నూలు, మే 15 (శ్రీచక్ర): నగరపాలక సంస్థలో పనిచేసే ఉద్యోగుల్లో విధుల పట్ల నిర్లక్ష్యం, క్రమశిక్షణ లోపం ఉంటే ఇంటికే వెళ్లక తప్పదని కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. శుక్రవారం ఆయన 14వ శానిటేషన్ మస్టర్ను తనిఖీ చేశారు. అనంతరం చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా, వాణిజ్య నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ క్రమంలో కార్మికుల్లో ఒకరు హాజరు వేసుకుని ఇంటికి వెళ్లడం, మరొకరు మొబైల్లో చూస్తూ కాలక్షేపం చేయడాన్ని గమనించిన కమిషనర్, వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికి వెళ్లిన ఉద్యోగి జీతం కట్ చేయాలని ఆదేశించారు. చరవాణి చూస్తూ కాలక్షేపం చేస్తే జీతాలు ఇవ్వాలా? హాజరు వేసుకుని ఇంటికి వెళ్తే ఉద్యోగం ఎందుకు? అంటూ సిబ్బందిని తీవ్రంగా హెచ్చరించారు. పిన్ పాయింట్ ప్రొగ్రాం ప్రకారం పారిశుద్ధ్యాన్ని కచ్చితంగా అమలు చేసి ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులకు ఉద్దేశపూర్వకంగా గైర్హాజరు కావడం, పని సమయాల్లో మొబైల్ ఫోన్లతో కాలక్షేపం చేయడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. అనంతరం పరిమళ నగర్లోని అన్న క్యాంటీన్ను పరిశీలించిన కమిషనర్, అక్కడి స్వచ్ఛత, తాగునీటి సరఫరా, భోజన నాణ్యత వంటి అంశాలను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఎలాంటి లోపం లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. నగరపాలక కార్యాలయంలో ప్రజలకు కల్పించనున్న వసతులను కమిషనర్ పరిశీలించారు. ఇటీవల ఆయన ఆదేశాల మేరకు కుర్చీలు, వాటర్ కూలర్, హెల్ప్ డెస్క్, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత కార్పొరేషన్పై ఉందని, కూర్చోవడానికి కుర్చీలు, తాగడానికి చల్లని నీళ్లు, సహాయం చేయడానికి హెల్ప్ డెస్క్ వంటి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. అదేవిధంగా వెండర్ జోన్ల ఏర్పాటుకు వెంకటరమణ కాలనీలోని హరిత హోటల్ వెనుక ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు మునిస్వామి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనాల పై ప్రత్యేక డ్రైవ్

30 వాహనాలకు జరిమానా

కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్

కర్నూలు, మే 15 (శ్రీచక్ర): కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 30 వాహనాలకు జరిమానాలు విధించారు. కర్నూలు నగరంలో నంబర్ ప్లేట్ లేని ద్వి చక్ర వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో కర్నూలు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మొత్తం 30 ద్విచక్ర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం వారికి జరిమానాలు విధించారు.కొత్త నంబర్ ప్లేట్లను అమర్చేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలను కలిగి ఉండాలని మరియు వాహానాలకు నంబర్ ప్లేట్లు స్పష్టంగా ఉంచాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నంబర్ ప్లేట్లు లేని 10 వాహనాలకు జరిమానా

కర్నూలు వన్ టౌన్ సీఐ మారుతి శంకర్

కర్నూలు, మే 15 (శ్రీచక్ర): కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం కర్నూలు ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెయిన్ బజార్ ప్రాంతంలో కర్నూలు వన్ టౌన్ సీఐ మారుతి శంకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 10 వాహనాలను గుర్తించి, వాటి యజమానులపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. అనంతరం వాహనదారులతో అక్కడికక్కడే నూతన నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేయించారు. నంబర్ ప్లేట్లు లేని వాహన చోదకుల వాహనాలకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నంబర్ ప్లేట్లు లేని వాహానాలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా పోలీసు అధికారులు హెచ్చరించారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి..

బీఎస్పీ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవుల రాజకీయ చైతన్య సభ దిగ్విజయం..

మంత్రాలయం, మే15, (శ్రీచక్ర) : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచా లక్ష్మీ నారాయణ పిలుపునిచ్చారు. గురువారం బహుజన సమాజ్ పార్టీ బిఎస్ఎస్, ఎమ్మార్పిఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంత్రాలయం, రాఘవేంద్ర సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ప్లేకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ, ర్యాలీ నిర్వహించారు. అనంతరం దళిత క్రైస్తవుల రాజకీయ చైతన్య సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వందలాది మంది ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చి సభను జయప్రదం చేశారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీనియర్ నాయకులు పి.బాలస్వామి, ఆంధ్రప్రదేశ్ బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ మహాపురుషుల్ని స్మరించుకొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా ఇంచార్జిలు గాడి అరుణ్ కుమార్, హనుమన్న , సామేలు, రవి కుమార్, రామలింగప్ప, శాంతరాజ్, సుంకప్ప, సలీంబాషలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలో ఎన్డీఏ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళిత క్రైస్తవుల పైన, ఫాస్టర్ల చర్చిలపైన దాడులను, హత్యలు, అత్యాచారాలు మత మార్పిడిలు వంటివి కార్యక్రమాలను నిర్వహిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు.రాజకీయ చైతన్యం:అట్టడుగు వర్గాలు రాజకీయంగా ఎదిగినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమని నేతలు నొక్కి చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ లు రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలన్నారు.

"వన్ మంత్ - ఫోర్ విజిట్"తో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

ఆళ్లగడ్డలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన
ఒక్కరోజే 458 అర్జీలు స్వీకరణ - వేగవంత పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు
21 రోజులలోపు ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యం : కలెక్టర్ రాజకుమారి గణియా
ప్రజల వద్దకే అధికారులు రావడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం
గ్రీవెన్స్ లేని ఆళ్లగడ్డే లక్ష్యం : ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, మే 15 (శ్రీచక్ర): వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రజల ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ప్రజల నుండి నేరుగా వినతులు, ఫిర్యాదులు, సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి దూర ప్రాంతాల ప్రజలు రావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నందున, ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిరంతరాయంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వాటి స్వభావాన్ని బట్టి ఒక రోజు నుండి గరిష్టంగా 21 రోజుల లోపు పరిష్కరించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికల నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, అందులో భాగంగా మొదటిసారిగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఒక్కరోజే సుమారు 458 అర్జీలు అందాయని, వాటన్నింటినీ స్కాన్ చేసి సంబంధిత అధికారుల లాగిన్‌లకు పంపిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.ప్రజల నుండి అందిన ఫిర్యాదుల్లో దాదాపు 60 శాతం భూ వివాదాలకు సంబంధించినవేనని, 25 శాతం అభివృద్ధి పనులు, రహదారులు, కల్వర్టులు, పాఠశాలల స్థల సమతలీకరణ, శ్మశాన వాటికలు వంటి అంశాలపై ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన 10 నుంచి 15 శాతం వరకు వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు, సదరం స్లాట్లకు సంబంధించిన సమస్యలేనని పేర్కొన్నారు. అలాగే మొదటి, రెండో శుక్రవారాల్లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, మూడో శుక్రవారం నాటికి వాటి పరిష్కారానికి చర్యలు పూర్తి చేయాలని, నాలుగో శుక్రవారం నిర్వహించే సమీక్షలో ఎన్ని కేసులు పరిష్కరించామో, ఎన్ని పట్టాలు పంపిణీ చేశామో సమగ్రంగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమర్థవంతంగా స్పందించకపోవడం వల్లే ప్రజలు జిల్లా కలెక్టర్ దాకా రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, గ్రామ మరియు మండల స్థాయి అధికారులు తమ పనితీరును మెరుగు పరచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినా, తప్పుడు సమాచారం అందించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే శుక్రవారం ఉదయం 9 గంటలకే అధికారులు హాజరై, కనీసం 450 అర్జీల పరిష్కారంతో బాధితులకు పత్రాలు అందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, గతంలో చిన్న చిన్న పనుల కోసం ప్రజలు అధికారుల చుట్టూ ఎన్నోసార్లు తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తుండటం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. అధికారులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా స్వేచ్ఛగా పని చేసే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఇంకా అనేక వెనుకబడిన ప్రాంతాలు ఉన్నాయని, ప్రజలు అభివృద్ధి పనులు కోరుతూ ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఫిర్యాదులు లేని ఆళ్లగడ్డ, సమస్యలు లేని ఆంధ్రప్రదేశ్‌ను చూడాలన్నదే తమ లక్ష్యమని ఆకాంక్షించారు. మండలాల వారీగా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఎక్కువ ఫిర్యాదులను పరిష్కరించిన మండల అధికారులను ప్రోత్సాహకంగా సన్మానిస్తామని తెలిపారు. దీన్ని పోటీగా భావించి అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే అఖిలప్రియ పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను వినేందుకు వరుసగా నాలుగు శుక్రవారాలు జిల్లా యంత్రాంగం మొత్తం ఆళ్లగడ్డకు రావడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్, ఆర్డీఓ, డీఎస్పీ, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బందికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.×ప్రత్యేక పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన సమస్యలు1) చాగలమర్రి మండలం ముత్యాలతండాకు చెందిన బుక్కే వీరమ్మ భాయ్ తనకు సొంత భూమి లేదని, సర్వే నెం.959లో అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. సదరు భూమికి డి-పట్టా మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. 2) రుద్రవరం మండలం నరసాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక (మెయిన్) పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, పాఠశాలలో ఉన్న మూడు పాత తరగతి గదులు శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే ప్రమాదంలో ఉన్నాయని ఉపాధ్యాయుడు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తరగతి గదులను పునర్నిర్మించడంతో పాటు, పాఠశాల రహదారికి సమీపంలో ఉండటంతో విద్యార్థుల భద్రత కోసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. 3) ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామానికి చెందిన వెంకట సుబ్బమ్మ తన భర్త మరణించి రెండేళ్లు అయినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి పెన్షన్ మంజూరు కాలేదని పేర్కొన్నారు. తనకు విధవ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. 4) ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి సర్వే నెం.380లోని రెండు ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, సర్వే నెం.349కు సంబంధించిన రీసర్వేలో 0.16 సెంట్లకు బదులుగా 1.71 సెంట్లు నమోదయ్యాయని తెలిపారు. సంబంధిత భూ విస్తీర్ణ వివరాలను సరిచేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మే 15 (శ్రీచక్ర): పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ జాప్యం లేకుండా పన్నుల వసూళ్ల ప్రక్రియ కొనసాగాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో జీఎస్టీ కో ఆర్డినేషన్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ మార్గాలను మెరుగుపరచడంతో పాటు పన్ను వసూళ్లలో పారదర్శకతను పెంచాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి (2026-27) గాను ఊా ఆదాయనికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బకాయిదారుల పాన్ నంబర్లకు లింక్ అయి ఉన్న అన్ని బ్యాంక్ ఖాతాల వివరాలను జీఎస్టీ అధికారుల నుండి తీసుకొని వెంటనే ఫ్రీజ్ చేయాలని కలెక్టర్ ఎల్డిఎమ్ ను ఆదేశించారు. జిఎస్టీ అధికారులు బకాయిదారుల నుండి రికవరీలు చేసే సమయంలో లేదా ఆర్.ఆర్. ఆక్ట్ (ఖీవలవనిబీవ ఖీవఇనీలవతీఎ ంఇబి) కింద వేలం వేసేటప్పుడు తగిన సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ పోలీస్ వారిని ఆదేశించారు. నిషేధిత ఆస్తుల జాబితాను జీఎస్టీ వారి నుండి సేకరించి వాటిని నిషేధిత ఆస్తుల జాబితాలో పెట్టాలని కలెక్టర్ రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. ఖీఃఇ, ఖీచిూ, ంఖఓూఎఆఅ వంటి శాఖల కాంట్రాక్టర్లు క్రమంగా టాక్స్ చెల్లిస్తున్నారా లేదా అనే డేటాను సేకరించాలని అందుకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులతో తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ వారు తమ కాంప్లెక్స్ లలో షాపులను అద్దెకు ఇచ్చిన వారిలో ట్యాక్స్ కడుతున్నారో లేదో చెక్ చేయాలన్నారు. పన్నులు సరిగ్గా చెల్లించకపోతే భారీగా జరిమానాలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వివరాలు మరియు వారు వృత్తి పన్ను (ఖు) చెల్లిస్తున్నారా లేదా అనే వివరాలను సేకరించాలని కలెక్టర్ డిఈఓ ను ఆదేశించారు. డాక్టర్లు, డయాగ్నస్టిక్ ల్యాబ్స్ వారు పన్నులు చెల్లిస్తున్నారో లేదో వివరాలను తీసుకొని చెక్ చేయాలని కలెక్టర్ కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ ను ఆదేశించారు. సమావేశంలో కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం అశోక్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ రమణ రెడ్డి, డి ఎస్ ఓ రాజా రఘువీర్, ఎల్డిఎమ్ మోహన్, డి ఈ ఓ సుధాకర్, సర్వ శిక్ష అభియాన్ పిఓ లోకరాజ్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గోడ కూలి పడి వ్యక్తి మృతి



మంత్రాలయం , మే 15,(శ్రీచక్ర) : ప్రమాదవశాత్తు గొడ కూలి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మంత్రాలయం లో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మంత్రాలయం మండలం వి. తిమ్మాపురం గ్రామానికి చెందిన ఉల్లిగప్ప మంత్రాలయంలో జితేంద్ర ఇంటి నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ గురురాజ్ దగ్గర రోజు వారీ కూలి పనుల నిమిత్తం ఇంటి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు గొడ కూలి పడి ఉల్లిగప్ప (21) తలకు తీవ్రం గా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. తండ్రి పరుశురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీ పరిధిలోని అభివృద్ధి పనులను తనిఖీ చేసిన..

ఆదోని డివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణ రెడ్డి

మంత్రాలయం, మే 15,(శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి పనులను ఆదోని డివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణ రెడ్డి శుక్రవారం అకస్మిక తనిఖీ చేశారు. ముందుగా మంత్రాలయం గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్ డబ్ల్యూ పీసీ షెడ్ నిర్వహణను పరిశీలించారు. అనంతరం సచివాలయం?2 అలాగే కల్లుదేవ సచివాలయాలను సందర్శించి పలు అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ పారిశుద్ధ్యం, జనగణన నమోదు అంబాసిడర్ల జీతాల విడుదల, ప్రభుత్వం కల్పించిన ఇంటి పన్నుపై 5% రాయితీపై అవగాహనతో పన్నుల వసూళ్లు, ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు, గ్రామపంచాయతీ రికార్డుల అప్డేషన్ మరియు ఇతర కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామపంచాయతీలలో అన్ని పరామితులు ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులను సిబ్బందికి బాలకృష్ణ రెడ్డి ఆదేశించారు. రికార్డుల నిర్వహణ, పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్య నిర్వహణ మరియు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీమతి నూర్జహాన్ గారు, పీడీవో శ్రీ ఉపేంద్ర రెడ్డి గారు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మృతున్ని కుటుంబానికి అండగా ఉంటాం

మంత్రాలయం , మే 15,(శ్రీచక్ర) : మంత్రాలయం మండలం వి. తిమ్మాపురం గ్రామానికి చెందిన ఉల్లిగప్ప రోజు వారీ కూలి పనుల నిమిత్తం మంత్రాలయంలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు గొడ కూలి పడి ఉల్లిగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి దృష్టికి వెళ్లడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి / మండల ఇన్ చార్జ్ సి. వి. విశ్వనాథ్ రెడ్డి ఆస్పత్రి వద్ద కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి తక్షణ సహాయం కింద రూ 10 వేల నగదును అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అధైర్య పడొద్దని హామి ఇచ్చారు.

ఎల్లప్ప మహామాత మారెమ్మ అవ్వ దేవాలయంలో హుండీలోని డబ్బులన్నీ చోరి,

ఎమ్మిగనూరు, మే, 15 (శ్రీ చక్ర): ఎమ్మిగనూరు మండల పరిధిలోని కే.తిమ్మాపురం గ్రామంలో బొంతల ఎల్లప్ప మహామాత అయినటువంటి మారెమ్మ అవ్వ దేవాలయం అభివృద్ధి కమిటీ మాట్లాడుతూ ఏడు తరాలుగా మా సామాజిక వర్గంలో ఉన్న దేవాలయం హుండీని కోసి పది లక్షలు 83 వేల రూపాయలను ఎత్తుకెళ్లారని వారు పోలీసులకు ఫిర్యాదు చేసిన కూడా, దానితోపాటు కంప్లైంట్ వ్రాతపూర్వకంగా రాసి ఇచ్చిన కూడా పోలీసులు ఇంతవరకు స్పందించడం లేదని ఆలయ కమిటీ సభ్యులు వాపోతున్నారు. ఎన్ని కంప్లైంట్లు ఇచ్చిన కూడా పోలీసులు స్పందించడం లేదని ఆలయ తరపున బాధితులు వాపోతున్నారు. వారి పైన ఎన్ని కంప్లైంట్లు ఇచ్చినా కూడా వారికి పుష్కలంగా అధికార పార్టీ నాయకులు అండదండలు ఉండడంతోనే వారి మీద చర్యలు తీసుకోవడం లేదంటూ బాధితులు వాపోతున్నారు. వారు అధికార పార్టీ నాయకులు కాబట్టి అందులో వాళ్ల సొంత బ్యాంకు అకౌంట్లో దేవాలయం హుండీ అమౌంట్ను వేసుకున్నారని అడిగితే మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి మమ్మల్ని ఎవరేమీ చేయలేరని కరాకండిగా చెబుతున్నారు. ఇటు రాజకీయ నాయకులు కూడా పట్టించుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు. దేవాలయం హుండీ డబ్బులు విషయంలో వారు తప్పుచేసి మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకొని మాకు రక్షణ కల్పించాలని బాధితులు వాపోతున్నారు.

ఇందిరా నగర్ గ్రామ సచివాలయంలో ప్రింటర్ ఏర్పాటుఅర్జీలు, వార్తలపై స్పందించిన అధికారులు

వరదయ్యపాలెం, మే 15(శ్రీచక్ర): వరదయ్యపాలెం మండలం ఇందిరా నగర్ గ్రామ సచివాలయంలో ప్రింటర్ సౌకర్యాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు ధృవపత్రాలు, సేవలు వేగంగా అందించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.గ్రామ సచివాలయంలో ప్రింటర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ప్రముఖ దినపత్రికల్లో వార్తలు ప్రచురితమవడంతో ఎంపీడీఓ కార్యాలయం స్పందించి తక్షణ చర్యలు చేపట్టింది.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, వరదయ్యపాలెం ఎంపీడీఓ విజయమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ బసిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణి పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ప్రింటర్ ఏర్పాటు పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ అధికారులకు, సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

సత్యవేడు నియోజకవర్గం వైసీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా నక్కా శోభన్ కుమార్ యాదవ్ నియామకం

సత్యవేడు, మే 15(శ్రీచక్ర): వైఎస్ఆర్సిపి అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలం పెద్దపాండూరు గ్రామపంచాయతీకి చెందిన యువ నాయకుడు నక్కాశోభన్ కుమార్ యాదవ్ ను సత్యవేడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా విభాగం అధ్యక్షులుగా నియమిస్తూ గురువారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. నియోజకవర్గ సోషల్ మీడియా విభాగం అధ్యక్షులుగా నియమితులైన నక్కా శోభన్ కుమార్ యాదవ్ కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు, మే 15 (శ్రీచక్ర)శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గం"ల వరకు ఎంపి ట్రాన్స్ కో గొల్లపాలెం పరిధి లో గల 132 కేవీ లైన్ల మరమత్తుల భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ .ఉదయభాస్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు విషయాన్ని ఆయన శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.కాజులూరు,కరప ,తాళ్లరేవు,పెదపూడి మండల్లో గల సంపర సబ్ స్టేషన్ పరిధి లో గల గ్రామములకు , ఇండస్ట్రియల్ , ఆక్వా సర్వీసులకు అవసరాన్నిబట్టి అత్యవరస పరిస్థితిలో సరఫరా నిలిపి వేయుదురని పేర్కొన్నారు.కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఉదయ భాస్కర్ పేర్కొన్నారు .

సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రజాసంఘాలలో చేరిన సత్యవేడు నియోజకవర్గ సిపిఎం మాజీ నేతలు

సత్యవేడు, మే15(శ్రీచక్ర):సత్యవేడు నియోజకవర్గం లోని సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు మండలాలకు చెందిన మాజీ సిపిఎం నేతలు శుక్రవారం సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రజాసంఘమైన ఏఐకేఎంఎస్, ఐఎఫ్టియు లో చేరారు. తిరుపతి నారాయణపురం లోని ఐఎఫ్టియు కార్యాలయంలో వారికి ఏ ఐ కె ఎమ్ ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి వెంకటరత్నం పార్టీ కండువాళు కప్పి ఆహ్వానించారు. వీరిలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఎం సీనియర్ నాయకుడుగా ఉన్న అరుణాచలం, నాగలాపురం మండల కార్యదర్శిగా పనిచేసిన మురుగేషన్ తో పాటు దినమణి, పద్మ, దక్షిణామూర్తి ఉన్నారు. ఈసందర్భంగా ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు పి.వెంకటరత్నం మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గం లో అనేక భూ సమస్యలు ఉన్నాయని, కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని, రైతులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీటిపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అరుణాచలం మాట్లాడుతూ 20 ఏళ్లుగా తాను సిపిఎం పార్టీలో వివిధ స్థాయిలో పని చేశానని తెలిపారు. నేడు ఆ పార్టీలో సిద్ధాంతాలను పక్కన పెట్టి వ్యక్తి పూజ ఎక్కువైందని ఆరోపించారు. ఈనేపథ్యంలో తామంతా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అనుబంధ ప్రజా సంఘాలలో చేరి పనిచేయాలని నిర్ణయించుకున్నామన్నారు.

మాభూమిని మేము కాపాడుకోవాలి అనుకోవడం తప్పా?మా భూమి... మా హక్కు"చట్టం ఉన్నా కూడా భూములు ఇవ్వం" ? రైతుల గళం

సత్యవేడు, మే 15(శ్రీచక్ర):సత్యవేడు తహసీల్దార్ కార్యాలయం నందు తహసీల్దార్ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో జేసీ, ఆర్డీఓ తో రైతులు ప్రత్యేక సమావేశంలో చర్చలు జరిపారు. ప్రభుత్వ అభివృద్ధి పేరుతో భూముల సేకరణ అంశం మరోసారి గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళనలకు దారితీస్తోంది. "మా భూమి ని మేము కాపాడుకోవాలని అనుకుంటున్నాము? మమ్మల్ని ఇబ్బంది పెట్టద్దు" అంటూ రైతులు తిరుపతి జిల్లా జేసీ గోవిందరావు కు స్పష్టమైన సందేశం ఇస్తున్నారు. ఇది కేవలం భూమి వివాదం కాదు జీవనాధారాన్ని, భవిష్యత్తును, కుటుంబాల గౌరవాన్ని కాపాడుకునే పోరాటంగా మారుతోంది.రైతులు చెబుతున్న ప్రధాన అంశం ఒకటే ? "చట్టం ప్రకారం వ్యవహరించాలి."భూములు కోర్టు పరిధిలో ఉన్నా కూడా అధికారుల వైఖరిలో మార్పు లేదని ఆరోపిస్తున్నారు. "కోర్ట్ ఉత్తర్వులను గౌరవిస్తారా? లేక పట్టించుకోరా?" అన్న ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ దేవేందర్ రెడ్డి "కోర్టు ఉత్తర్వులను గౌరవిస్తాం" అని ప్రకటించడం కొంత ఉపశమనం కలిగించినా? రైతుల అనుమానాలు మాత్రం ఇంకా తొలగలేదు. గతంలో జరిగిన చర్యల వలన నమ్మకం దెబ్బతిందని వారు చెబుతున్నారు. ప్రత్యేకంగా, ''దురుద్దేశ్యంతో రిజిస్ట్రేషన్లు రద్దు చేయడం వల్ల భూముల విలువలు పడిపోయాయి" అన్న రైతుల వాదన తీవ్రమైనది. భూముల మార్కెట్ విలువలు పెరగకుండా కావాలనే ఆటంకాలు సృష్టిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఒకవైపు అభివృద్ధి పేరుతో భూములు కోరుతూ? మరోవైపు వాటి విలువ తగ్గేలా చర్యలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డుతున్నారు."ఎంహంచ్ చేసేదానికి రైతులు ఒప్పుకునే పరిస్థితి లేదు" అని గ్రామస్థులు తేల్చి చెబుతున్నారు. వారి మాటల్లో భయం కంటే బాధ ఎక్కువగా కనిపిస్తోంది. తరతరాలుగా సాగు చేస్తున్న భూమిని కోల్పోవడం అంటే కేవలం ఆస్తి కోల్పోవడం కాదు? జీవన విధానమే మారిపోవడం. "బలవంతపు భూ సేకరణకు రావద్దు" అని రైతులు హెచ్చరిస్తున్నారు. పరిహారం పేరుతో కోట్ల రూపాయలు ఇచ్చినా కూడా భూమికి సమానమవదని వారు అంటున్నారు. "ఎకరాకు కోటి రూపాయలు ఇచ్చినా తక్కువే" అనే వ్యాఖ్య రైతుల భూమిపై ఉన్న భావోద్వేగ బంధాన్ని ప్రతిబింబిస్తోంది. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే? "ప్రభుత్వానికి అవసరమైతే వేరే చోట తక్కువ ధరకే భూములు అందుబాటులో ఉన్నాయి" అని రైతులే సూచిస్తున్నారు. అంటే అభివృద్ధికి వారు వ్యతిరేకం కాదని? కానీ తమ భూములపై బలవంతం అంగీకరించబోమని స్పష్టం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. చట్టాన్ని గౌరవించడం, కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం, రైతుల అభిప్రాయాలను వినడం ప్రజాస్వామ్య బాధ్యత. అభివృద్ధి పేరుతో ప్రజల మనసులు గాయపడితే? అది అభివృద్ధి కాదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.చివరగా రైతుల ప్రశ్న ఒక్కటే''మా భూమిని కాపాడుకోవాలని కోరుకోవడం తప్పా?" అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సుశీల్ కుమార్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, విజయశంకర్ రెడ్డి, జయశంకర్ రెడ్డి, అనేకమంది రైతులు పాల్గొన్నారు.

వర్క్ ఔట్సోర్సింగ్ విధానాన్ని వెంటనే.రద్దు.చేయాలి.

మార్కాపురం మే 15 (శ్రీ చక్ర)మార్కాపురం ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో మార్కాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ మున్సిపాలిటీలో వర్క్ ఔట్సోర్సింగ్ పేరుతో అన్ని విభాగాలను ప్రైవేటీకరణకు ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. వర్క్ ఔట్సోర్సింగ్ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మున్సిపల్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస వేతనం 26,000 వేతనాలు ఇవ్వాలని,ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికులకు అమలు చేయాలని, ఉద్యోగ విరమణ 62 సంవత్సరాలకు పెంచాలని అన్నారు. మున్సిపల్ రంగంలో కార్మికులకు నష్టం చేకూర్చే ప్రైవేటీకరణ విధానాలను వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కే సుబ్బరాయుడు, కార్యదర్శి గొట్టం హరి, చెన్నకేశవులు, చిన్న రాయుడు, పి శ్రీను, దాసు, రషీద్, తదితరులు పాల్గొన్నారు

పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు తగ్గించాలి - సిపిఐ, ఏఐటీయూసీ, కాంగ్రెస్ డిమాండ్

మార్కాపురం మే 15 (శ్రీ చక్ర)మార్కాపురం: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యావసర వస్తువులధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, ఏఐటీయూసీ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ఈరోజు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.పూల సుబ్బయ్య భవనం నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధులగుండా ఆర్డీఓకార్యాలయంవరకు సాగింది.అనంతరంఆర్డీఓగారికి వినతి పత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి×, మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, సిపిఐ సీనియర్ నాయకులు అదే నాసరయ్య, షేక్ ఖాసిం తదితర సిపిఐ, ఏఐటీయూసీ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ, "సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి వచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని నిత్యావసర వస్తువుల ధరలు.ఆకాశాన్ని.అంటుతున్నాయి.ధరలుతగ్గించాలి' అని డిమాండ్ చేశారు.

కోలంక సొసైటీ నీ సందర్శించిన మురాల శెట్టి

కాజులూరు, మే 15(శ్రీచక్ర)గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ కోలంక సొసైటీ భవనాన్ని సందర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కాజులూరు మండలం కాలంక గ్రామంలో శిధిలావస్థలో ఉన్న కోలంక సొసైటీ భవనాన్ని తొలగించనున్న నేపథ్యంలో సొసైటీ ఆఫీస్ ను కోలంక మెయిన్ రోడ్ లో గల కరూర్ వైశ్య ఏటీఎం సెంటర్ పక్కన బిల్డింగ్ లోకి మార్చటంతో ఈ సొసైటీ బిల్డింగ్ ని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ సందర్శించి నూతన సొసైటీ భవనం త్వరగా నిర్మించి రైతులకు మరింత మెరుగు అయిన సేవలు అందించాలని ఆయన అన్నారు .నూతన భవనం నిర్మాణం కొరకు తమ సహకారం ఉంటుందని చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ అన్నట్లుగా కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహా నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న,కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు, నీటి వియోదారుల సంఘం సభ్యుడు బొండా సముద్రయ్య, కోలంక సొసైటీ ఎకౌంటెంట్ బాలాంత్రపు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన సరళావతి

రామచంద్రపురం, మే 15(శ్రీచక్ర)రామచంద్రపురం ఆర్డీవో గా ఏ సరళావతి బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ కలెక్టర్ , ఏపీ సెక్రటేరియట్, అమరావతి నుండి ప్రభుత్వ ఆదేశాలు మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారి , సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, రామచంద్రపురం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సరళావతికి రామచంద్రపురం ఆర్డీవో ఆఫీస్ పరిపాలన అధికారిని ఎల్.ఝాన్సీ లక్ష్మీ కుమారి, సిబ్బంది, తహశీల్దార్ లు, మున్సిపల్ కమిషనర్, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ రాజు, తదితరులు పుష్పగుచ్చం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

మార్కాపురం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గా పివి కృష్ణారావు.



మార్కాపురం మే 15(. శ్రీ చక్ర)మార్కాపురం బిజెపి జిల్లా అధ్యక్షుడిగా పివి కృష్ణారావును నియమిస్తున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ అధికారికంగా ప్రకటించారు. జిల్లా నుండి ఎంతోమంది జిల్లా అధ్యక్ష పదవి కోసం పోటీ చేసినప్పటికీ అధిష్టానం మాత్రం పివి కృష్ణారావు కే జిల్లా అధ్యక్ష పదవి ప్రకటించడంతో పలువురు బిజెపి నాయకులు శ్యాలువ, పూలమాలల తో సత్కరించి అభినందనలు తెలిపారు. 1990 సంవత్సరం నుండి 95 సంవత్సరంలో ఏబీవీపీలో పనిచేసి 95 నుండి 2001 వరకు బిజెపి యువ మోర్చా పట్టణ అధ్యక్షునిగా మరియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు పివి కృష్ణారావు. అదేవిధంగా 2001 నుండి 2004 వరకు మార్కాపురం పట్టణ అధ్యక్షులుగా చేశారు. 2004 నుండి 2008 వరకు ప్రకాశం జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా కూడా చేశారు. 2008 నుంచి 2011 వరకు అసెంబ్లీ బిజెపి ఇన్చార్జిగా కొనసాగారు. 2014 నుండి 18 వరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా 2018 నుండి 2026 వరకు అసెంబ్లీ ఇన్చార్జిగా కొనసాగుతూ గుర్తింపు పొందిన పివి కృష్ణారావుకు నేడు అధిష్టానం మార్కాపురం జిల్లా అధ్యక్షునిగా ప్రకటించడం హర్షనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర అధ్యక్షులు నాకు ఈ బాధ్యతను అప్పగించినందున బాధ్యతాయుతంగా జిల్లాలో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా పయనిస్తానని పివి కృష్ణారావు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రఅధ్యక్షులు మరియు సంబంధిత పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శాతరాజు పల్లి ప్రవీణ్, కె నాగరాజు, రామకృష్ణ, గుమ్మ రాఘవేంద్ర, జీవి రెడ్డి, బత్తుల పాలంకయ, పాటు పలువురు నాయకులు కార్యకర్తలు, కృష్ణారావుకు అభినందనలు తెలిపారు.

రెండు ఈ-ఆటోలు చెత్త సేకరణ కోసం విరాళంగా అందజేత.

హిందూపురం మే16 హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి బీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా రెండు ఈ-ఆటోలు చెత్త సేకరణ కోనం మున్సిపాలిటీకి విరాళంగా అందజేయబడినట్లు మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం కొనసాగుతున్నదని బీఎస్ఆర్ ట్రస్ట్ సౌజన్యంతో సిఎస్సార్ నిధుల క్రింద ఉచితంగా అందించిన ఈ రెండు ఈ-ఆటోల ద్వారా డోర్ టు డోర్ చెత్త సేకరణ మరింత సమర్ధవంతంగా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు కూడా మున్సిపాలిటీ పారిశుధ్య కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలని చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా మునిసిపల్ కార్మికులకు అందించాలని, ప్లాస్టిక్ కవర్ల వాడకం నిర్మూలించాలని కోరారు.

జగన్ మావిగన్ యూ టర్న్...

విజయవాడ, మే 15,ఏపీ రాజకీయాల్లో ఒకప్పుడు మూడు రాజధానుల మంత్రం పఠించిన వైసీపీ హఠాత్తుగా మావిగన్ అనే ఊహాజనిత రాజధానిని ప్రకటించింది. జగన్ రెడ్డి ప్రకటించిన ఆ రాజధాని కాస్తా ఇప్పుడు ఆ పార్టీకి మింగుడు పడని వ్యవహారంగా మారింది. అమరావతికి పోటీగా అత్యంత ఖర్చు తక్కువతో ఈ కారిడార్‌ను అభివృద్ధి చేయవచ్చని అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించినా, అది క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ పొందకపోగా.. తీవ్ర స్థాయిలో ఎకసెక్కాలకు గురవుతోంది. సోషల్ మీడియాలో వస్తున్న సెటైర్లు, విమర్శలకు సమాధానం చెప్పుకోలేక ఇప్పుడు వైసీపీ శ్రేణులు ఈ అంశంపై వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నాయి.అమరావతిని అవినీతి గనిగా అభివర్ణిస్తూ, దానికి ప్రత్యామ్నాయంగా మావిగన్ మోడల్‌ను తెరపైకి తెచ్చినప్పుడు వైసీపీ నేతలు ఆకాశమే హద్దుగా మాట్లాడారు. కానీ, అది కేవలం ఒక ఊహాజనిత పదంగానే మిగిలిపోయిందని, దానికి ఎలాంటి శాస్త్రీయ పునాది లేదని మేధావుల నుంచి వచ్చిన విమర్శలతో ఆ పార్టీ డిఫెన్స్‌లో పడింది. అసలు మావిగన్ అనే పేరు వినగానే జనాల్లో వస్తున్న నవ్వులు చూశాక, ఈ అంశంపై చర్చ పెడితే పరువు పోవడం ఖాయమని గ్రహించిన నేతలు.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. రోజా వంటి వారు సైతం ఇప్పుడు ఆ రెండు ప్రాంతాలు ఒక్కటే కదా అంటూ సర్దుబాటు మాటలు మాట్లాడుతుండటం ఆ పార్టీలో నెలకొన్న అయోమయానికి నిదర్శనం.అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన గుర్తింపు ఇచ్చి, నిధులు కూడా మంజూరు చేస్తున్న తరుణంలో మావిగన్ ప్రస్తావన వైసీపీకి సెల్ఫ్ గోల్‌లా మారింది. ఒకవైపు అమరావతిలో పనులు శరవేగంగా జరుగుతుంటే, కేవలం ప్లాన్-బి అంటూ లేని కారిడార్ గురించి మాట్లాడటం వల్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతుందని ఆ పార్టీకి ఆలస్యంగా జ్ఞానోదయం అయినట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు మేధావులతో చర్చలు లేవు, సోషల్ మీడియాలో పోస్టులు లేవు. కేవలం తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన ఈ మావిగన్ సిద్ధాంతాన్ని జనం మరిచిపోయేలా చేయడమే ఇప్పుడు వైసీపీ ముందున్న ఏకైక మార్గంలా కనిపిస్తోంది.అమరావతిని దెబ్బకొట్టాలని తీసిన మావిగన్ అస్త్రం తిరగబడి సొంత పార్టీకే తగిలింది. రాజకీయంగా మైలేజ్ వస్తుందని ఆశించిన ఈ కాన్సెప్ట్ కాస్తా, ఇప్పుడు కేవలం మీమ్స్‌కు మాత్రమే పరిమితం కావడంతో వైసీపీ నేతలు ఇప్పుడు గన్ తీసి పక్కన పెట్టి, మళ్ళీ పాత సంక్షేమ రాగాన్నే అందుకోవాలని చూస్తున్నారు.

స్థల యజమానుల నుండి స్వచ్ఛంద అనుమతి తీసుకోవాలి : జి.ఎం.సి కమిషనర్

గుంటూరు మే 15 బృందావన్ గార్డెన్స్ రోడ్డు విస్తరణకు స్థలాలు ఇచ్చే స్థల యజమానుల నుండి స్వచ్ఛంద అనుమతి పత్రాలను తప్పనిసరిగా తీసుకోవాలని నగర కమిషనర్ కే.మయూర్ అశోక్ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో పట్టణ ప్రణాళిక మరియు ఇంజనీరింగ్ అధికారులతో రోడ్డు విస్తరణ పనుల వేగవంతంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో బృందావన్ గార్డెన్స్ నుండి హనుమయ్య కంపెనీ వరకు విస్తరణ పనులను వేగంగా రోజు వారీ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా 60 అడుగుల రోడ్డును 80 అడుగుల రోడ్డుగా విస్తరణ చేస్తున్నందున పనులు రోడ్డు విస్తరణ పనులను పట్టణ ప్రణాళిక మరియు ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణ చేయుటకు పెండింగ్ ఉన్న ప్రాంతాన్ని మార్కింగ్ చేసి, ఆ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలను క్లియర్ చేసి, త్వరితగతిన ఇంజనీరింగ్ అధికారులకు అందజేయాలన్నారు. అదేవిధంగా ఇంజనీరింగ్ అధికారులు కూడా సదరు ప్రాంతంలో డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణకు సంబంధించి కోర్ట్ కేసులు ఉన్న వాటి వివరాలు అడిగి తెలుసుకొని, కేసులు ఉన్న వాటికి న్యాయ పరమైన సలహా తీసుకొని రోడ్డు విస్తరణకు ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు.

వాడుకున్నాడు.. వదిలేశాడు..

-ప్రియుడు ఇంటి ముందు ప్రియురాలు బైటయింపు

-ప్రియుడుతోనే పెళ్లి కావాలి లేకపోతే మరణమే శరణ్యం

మంత్రాలయం, మే15, (శ్రీచక్ర) : వారి కులాలు వేరు వేరైనా నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వాడుకుని వదిలేశాడు. దీంతో ప్రియుడు ఇంటి ముందు ప్రియురాలు పెళ్లి జరిపించాలని రెండు రోజులుగా బైటాయించి కూర్చింది. పోలీసులను ఆశ్రయించితే వారి నుండి ఎలాంటి స్పందన లేదు. దీంతో ప్రియుడు ఇంటి ముందు బైటాయించి నిరసన తెలిపింది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం .. మంత్రాలయం మండలం సూగురు గ్రామంలో చాకలి ఆనంద్, లక్ష్మి దంపతులకు ఆరుగురు ఆడపిల్లలు. ఇందులో చివరి చిన్న కూతురు శశికళ ఆరవ తరగతి వరకు చదివింది. అదే గ్రామానికి చెందిన కురువ మునేప్ప కుమారుడు మురళి తో శశికళ కు పరిచయం ఏర్పడి.. చూపులు కలిసిన తరువాత మనసుకలిశారు. తరువాత ఇద్దరు దగ్గరయ్యామని తెలిపింది. ఇలా నాలుగేళ్లుగా సాఫీగా ప్రేమాయణం సాగిందని మధ్య లో మూడు నెలల గర్భం ను మాత్రాలు వేసి గర్భం పోయేటట్టు చేశాడని తెలిపారు. పెళ్లి చేసుకోవాలని అడిగితే మొఖం చాటేశాడని తెలిపారు. మురళి తోనే పెళ్లి చేసుకుంటానని లేకపోతే మరణమే శరణ్యం అని బాధితురాలు తెలిపింది. పోలీసులను ఆశ్రయించిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికి తాళం వేసి ప్రియుడుతో సహా కుటుంబ సభ్యులు పరారి అయ్యారని తెలిపారు. గత 4 ఏళ్లుగా ప్రియురాలు శశికళ, ప్రియుడు మురళి ప్రేమించుకుంటున్నారు. నా తల్లికి నిద్ర మాత్రలు వేసి నన్ను బెదిరించి శరీరకంగా వాడుకున్నాడని ప్రియురాలు ఆరోపించింది. పెళ్లి చేసుకోనేంత వరకు ఇంటి ముందే బైటాయిస్తానని బాధితురాలు శశికళ ఆవేధన వ్యక్తం చేసింది.కులాలు వేరు కావడంతో ప్రియుడు కుటుంబ సభ్యులు నిరాకరిస్తున్నారని పెళ్లి చేసుకొనేంత వరకు ప్రియుడు ఇంటి ముందే బైటయిస్తానని ప్రియురాలు శశికల డిమాండ్ చేశారు.పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితురాలు ఆరోపణలు చేసింది.

బొత్స స్థానంలో వరుదు...

విజయనగరం, మే 15, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికర రాజకీయ పరిణామాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అధినేత జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని బెంగళూరు వచ్చారు. అక్కడి నుంచి తాడేపల్లి కి చేరుకున్నారు. పార్టీ సీనియర్లతో వరుసగా సమావేశాలు జరుపుతారు. వచ్చే నెల నుంచి ఆయన జిల్లాల పర్యటనలు మొదలు పెడతారని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి ఆయన పర్యటనలు ఉంటాయని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. మరోవైపు జగన్మోహన్ రెడ్డి కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కొత్తగా పార్టీ తరఫున ఒక నియామకం చేపడతారని తెలుస్తోంది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. 175 అసెంబ్లీ స్థానాలకు గాను కేవలం 11చోట్ల మాత్రమే ఆ పార్టీ గెలిచింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాలేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి. కానీ శాసనమండలిలో మాత్రం 30 మందికి పైగా ఎమ్మెల్సీలు ఆ పార్టీకి ఉన్నారు. అక్కడ మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది తిరుగులేని ఆధిపత్యం. అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా ఉంది. అందుకే తనకు దక్కని ప్రతిపక్ష హోదా ఒక సీనియర్ కు ఇవ్వాలని భావించారు జగన్మోహన్ రెడ్డి. అలా బొత్స సత్యనారాయణకు చాన్స్ దక్కింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బొత్స చీపురుపల్లి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. కానీ విశాఖ స్థానిక సంస్థల నుంచి బొత్సకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి.. శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడిగా ఛాన్స్ ఇచ్చారు. అలా ఒక సీనియర్ నాయకుడిగా బొత్స సముచిత స్థానాన్ని దక్కించుకున్నారు.అయితే ఇటీవల తరచూ బొత్స అనారోగ్యానికి గురవుతూ వస్తున్నారు. రాజకీయాల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బొత్సకు రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండేందుకు వీలుపడటం లేదు. ఇప్పటికే కుటుంబ సభ్యులతో పాటు పిల్లలిద్దరూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ గా పని చేసేందుకు సిద్ధమయ్యారు. అందుకే బొత్సను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న క్రియాశీలక పదవుల నుంచి విముక్తి కలిగించాలని కుటుంబ సభ్యులు అధినేత జగన్మోహన్ రెడ్డిని కోరారట. ఆయన సానుకూలంగా స్పందించారట.

ఘర్ వాపసీ కష్టాలు

నెల్లూరు మే 15,వైసీపీ నుంచి చాలా మంది నేతలు గత రెండేళ్ళుగా బయటకు పోయారు, వివిధ కారణాలతో అనేక మంది పార్టీకి గుడ్ బై కొట్టారు. ఫ్యాన్ నీడన తమకు ఉక్కబోతగా ఉందని చెప్పి మరీ తలాఖ్ అనేశారు. వైసీపీలో ఏళ్ళ తరబడి పనిచేసిన వారు పునాదుల నుంచి ఉన్న వారు వైఎస్సార్ కుటుం బంతో తరాలుగా పనిచేస్తున్న వారు కూడా పార్టీ గేటు దాటారు. ఇదంతా ఒక విధంగా ఆశ్చర్యంగా సాగింది. రాజకీయాల్లో ఇవన్నీ మామూలు అయినా ఏ పార్టీకి అయినా మొదటి నుంచి ఉన్న వారు కొనసాగుతారు. అయారాం గయారాం ల విషయం అందరికీ ఎరుకే. కానీ పునాదుల నుంచి ఉన్న వారే వెళ్ళి పోవడం అంటే అది వైసీపీకి కలవరం కలిగించే అంశమే అని కూడా విశ్లేషణలు ఉన్నాయి.వైసీపీలో జగన్ తరువాత నంబర్ టూ అనిపిం చుకున్న విజయసాయిరెడ్డి పార్టీని వీడుతారని ఎవరూ కలలో కూడా అనుకోలేదు, ఆయన పార్టీ నుంచి చాలా సైలెంట్ గా నిష్క్రమించారు. అలాగే వైసీపీతోనే సర్వం అనుకున్న మాజీ మంత్రులు మోపిదేవి వెంకట రమణ, ఆళ్ల నాని, సామినేని ఉదయభాను, జగన్ బంధువు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వంటి వారు చాలా సులువుగా బంధాలను తెంపుకుని బయటకు వెళ్ళారు. ఇక మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎంపీల జాబితా చూస్తే చాలానే ఉంది. అంతవరకూ ఎందుకు ఎమ్మెల్సీలుగా ఇంకా చేతిలో అధికారం ఉన్నా కూడా వైసీపీ వద్దు అని పదవులు సైతం వదులుకుని వెళ్ళిన వారూ ఉన్నారు. అయితే వీరంతా వైసీపీ భారీ ఓటమికి సంబంధించిన బాధలోనో లేక కూటమి అధికారంలోకి వచ్చింది కాబట్టిసొంత ఇబ్బందుల వల్లనో వెళ్ళారని అంతా అనుకున్నారు. వైసీపీ అధినాయకత్వం కూడా అలాగే భావించి కొన్నాళ్ళకు అయినా వారంతా రిటర్న్ అవుతారు అని ఊహించింది. అయితే ఇతర పార్టీలలో చేరి ఇబ్బందులు పడుతున్నా తాము వైసీపీలోకి తిరిగి వెళ్లేది లేదని చాలా మంది నేతలు బాహాటంగా ప్రకటిస్తున్నారు అంటే వైసీపీ అంటే వారికి ఎంతటి వెగటు పుట్టిందో అర్థం కావడం లేదని అంటున్నారు. తాజాగా ఒంగోలు జిల్లా దిగ్గజ నేత మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అయితే తాను ఎట్టి పరిస్థితిల్లోనూ వైసీపీ గడప తొక్కేది లేదని అన్నారు. తన భవిష్యత్తు అంతా జనసేనలోనే అని క్లారిటీ ఇచ్చారు. అయినా తనను టార్గెట్ చేసి తాను వైసీపీలోకి వస్తున్నారు అని ప్రచారం చేయిస్తున్నారు అని మండిపడ్డారు. తాను జనసేనలో ఒక వేళ ఇబ్బంది పడినా వైసీపీకి వచ్చిన నొప్పి ఏంటని బాలినేని ప్రశ్నించారు.

ఏపీలో పొదుపు చర్యలు షురూ...

విజయవాడ, మే 15, పశ్చిమాసియా సంక్షోభం కారణంగా విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా స్పందించింది. . ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు ప్రతి ఒక్కరూ తమ కాన్వాయ్‌లను తగ్గించుకుని దేశ ఆర్థిక భద్రతే పరమావధిగా అడుగులు వేస్తున్నారు. నేడు జరిగిన కేబినెట్ సమావేశం ఇందుకు వేదికగా నిలిచింది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అధికారిక కాన్వాయ్‌ను 50 శాతం మేర కుదించుకున్నారు. గతంలో సుమారు 10కి పైగా వాహనాలతో వెళ్లే ముఖ్యమంత్రి, నేడు కేవలం 4 వాహనాలతోనే సచివాలయానికి చేరుకున్నారు. తన భద్రతా సిబ్బంది ఇబ్బంది పడకుండా ఉండటానికి, వారి కోసం ప్రత్యేకంగా ఒక బస్సును ఏర్పాటు చేశారుఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా తన కాన్వాయ్‌ను 4 వాహనాలకు పరిమితం చేసుకోవాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. జెడ్ కేటగిరీ భద్రత ఉన్నప్పటికీ, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. మంత్రి నాదెండ్ల మనోహర్ కేవలం 3 వాహనాల కాన్వాయ్‌తో సచివాలయానికి వెళ్లగా, మంత్రులు అచ్చెన్నాయుడు , మరి కొంత మంది వెళ్లి కేవలం ఒక్కో వాహనంలోనే కేబినెట్ భేటీకి హాజరయ్యారు.మంత్రి నారా లోకేశ్ తన కాన్వాయ్‌ను సగానికి కుదించి, కేవలం రెండు వాహనాలకే పరిమితం చేశారు. భద్రతా ప్రోటోకాల్ ప్రకారం రావాల్సిన ఇతర సిబ్బంది కోసం ఆయన కూడా ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఇది భద్రతను నిర్లక్ష్యం చేయకుండానే పొదుపును ఎలా పాటించవచ్చో తెలియజేస్తోంది. అంతేకాకుండా, మంత్రులు నిమ్మల రామానాయుడు, అనిత, పయ్యావుల కేశవ్ వంటి వారు ఎస్కార్ట్ వాహనాలు లేకుండా సింగిల్ వాహనాల్లోనే సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు.అంతర్జాతీయ పరిస్థితుల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా ఇంధన దిగుమతులపై ఒత్తిడి పెరుగుతోందని చంద్రబాబు గుర్తుచేశారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పెట్రోల్, డీజిల్ పొదుపు చేయాలని పిలుపునిచ్చారు. కేవలం ప్రభుత్వ స్థాయిలోనే కాకుండా, ప్రజలందరూ ఈ పొదుపు యజ్ఞంలో భాగస్వాములు కావాలని కోరారు.సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో క్యాబినెట్ భేటీ జరిగింది. దాదాపు పదికి పైగా వాహనాలతో వచ్చే చంద్రబాబు కేవలం నాలుగు వాహనాలకు మాత్రమే పరిమితం అయ్యారు. భద్రతా సిబ్బంది ఇబ్బంది పడకుండా ఉండేందుకు వారికోసం ఒక బస్సు ఏర్పాటు చేశారు. మంత్రి లోకేష్ సైతం తన కాన్వాయ్ ను తగ్గించుకున్నారు. కేవలం రెండు వాహనాలతో వచ్చారు. సీఎం మాదిరిగా తన సెక్యూరిటీ సిబ్బంది కోసం ఒక బస్సు ఏర్పాటు చేసుకున్నారు. పవన్ కళ్యాణ్ సైతం తన కాన్వాయ్ ని తగ్గించుకున్నారు. జడ్ క్యాటగిరి లో ఉన్న దుబారా తగ్గించేందుకు వీలుగా పవన్ సగానికి పైగా వాహనాలను తగ్గించుకోవడం విశేషం.చివరికి హోం మంత్రి వంగలపూడి అనిత సైతం తన ప్రోటోకాల్ పక్కన పెట్టి మరి తన వాహన శ్రేణిని తగ్గించుకున్నారు. కొందరు మంత్రులు అయితే సింగిల్ వాహనంలో క్యాబినెట్ భేటీకి హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ఎనిమిది పొదుపు అంశాలపై ఏపీ ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించేందుకు నిర్ణయించారు సీఎం చంద్రబాబు. ప్రధాని హైదరాబాద్ పర్యటనలో భాగంగా కీలక సూచనలు ఇవ్వగా ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి విమర్శలు వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోడీ ఆచరించి.. మిగతా వారికి చెబితే బాగుంటుందని మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యానించారు.

పిఠాపురం పెద్దన్న పవనే...

కాకినాడ, మే 15, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ తన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గానికి ప్రజా ప్రతినిధిగానే కాకుండా.. తన రాజకీయానికి హ్యూమన్ టచ్ ఇస్తున్నారు. పిఠాపురం మొత్తాన్ని ఆత్మీయ కుటుంబంగా భావిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా ప్రతినిధి పాత్రకు భిన్నంగా, ఆయన అక్కడ ఒక కుటుంబానికి పెద్దన్న తరహాలో ప్రతి ఇంటి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. రాజకీయాలకు అతీతంగా, నియోజకవర్గంలోని పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో భరోసా కల్పిస్తూ, ఒక పెద్దన్న తన కుటుంబం పట్ల చూపే బాధ్యతను ఆయన నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు పట్ల ఆయన చూపిస్తున్న శ్రద్ధ అందర్నీ ఆశ్చర్య పరుస్తోంది. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యాభ్యాసం కల్పించడంతో పాటు, తల్లిదండ్రులు లేని చిన్నారులకు భగవంతుని బిడ్డలు అని పేరు పెట్టి తన సొంత జీతం నుంచి నెలకు రూ. 5,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఒక తండ్రి తన పిల్లల చదువు కోసం ఎలాగైతే తపన పడతారో, పవన్ కళ్యాణ్ గారు కూడా పిఠాపురం విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుతున్నారు. విద్యా సంస్థలను ఒప్పించి ఉచిత అడ్మిషన్లు ఇప్పించడం ద్వారా ఒక తరం భవిష్యత్తును ఆయన తీర్చిదిద్దుతున్నారు.సంక్షేమ పథకాలను కేవలం ప్రభుత్వ ఫైళ్లకు పరిమితం చేయకుండా, పండుగ వచ్చిందంటే పిఠాపురంలోని ప్రతి ఆడబిడ్డకు తన తరఫున చీరలు పంపడం, కష్టాల్లో ఉన్న రైతులకు అండగా నిలవడం ఆయనకు అలవాటుగా మారింది. ఉపాధ్యాయుల సమస్యలైనా, సామాన్యుల ఆరోగ్య అవసరాలైనా పవన్ ఉన్నారు అనే ధీమా ఇప్పుడు నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తోంది. క్షే జలు ఆయనను ఒక నాయకుడిలా కంటే, తమ ఇంటి పెద్ద దిక్కులా భావించి కష్టాలు చెప్పుకుంటున్నారు. వాటిని ఆయన పరిష్కరిస్తున్నారు.పిఠాపుం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రోల్ మోడల్ గా మార్చే క్రమంలో పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ఈ వ్యక్తిగత సహాయ ? సామాజిక బాధ్యత ఫార్ములా ఒక సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికింది. నియోజకవర్గవ్యాప్తంగా 580 కంటే ఎక్కువ మార్కులు సాధించిన 31 మంది విద్యార్థులను గుర్తించి, వారి ఆసక్తికి అనుగుణంగా నచ్చిన కోర్సుల్లో చేర్పించే బాధ్యతను పవన్ కళ్యాణ్ స్వయంగా చేపట్టారు. వీరిలో రాష్ట్రస్థాయిలో 598 మార్కులతో టాపర్‌గా నిలిచిన విద్యార్థి కూడా ఉన్నారు.ఇప్పటికే తల్లిదండ్రులు లేని పిల్లలకు తన జీతం నుంచి నెలకు రూ. 5,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న ఆయన, ఇప్పుడు ఈ విద్యా సాయం ద్వారా మరో ముందడుగు వేశారు. కేవలం ఆర్థిక సాయమే కాకుండా, విద్యార్థుల కెరీర్ పట్ల ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. పవన్ కళ్యాణ్ చొరవతో పలు ప్రముఖ విద్యా సంస్థలు ఈ 31 మంది విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. విద్యార్థులు ఏ కాలేజీలో చదవాలనుకుంటున్నారో, ఏ కోర్సుపై వారికి ఆసక్తి ఉందో తెలుసుకొని, సంబంధిత యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి ఈ అవకాశాన్ని కల్పించారు. తన పిలుపును గౌరవించి విద్యార్థులకు బాసటగా నిలిచిన విద్యా సంస్థలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేయడమే కాకుండా, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో నాయకులు హామీలు ఇవ్వడం సహజం, కానీ ఇచ్చిన హామీలను దాటి తన వ్యక్తిగత చొరవతో, సొంత జీతంతో ప్రజలకు సాయం చేయడం పవన్ కళ్యాణ్ ప్రత్యేకతను చాటుతోంది. పిఠాపురం నియోజకవర్గంలో విద్యార్థుల పట్ల ఆయన చూపిస్తున్న ఈ ఆదరణ కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రజాప్రతినిధులకు ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది. సామాన్య విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుతున్న పవన్ కళ్యాణ్ పిఠాపురం వాసుల మనసు గెల్చుకుంటున్నారు.అభివృద్ధి పనుల కోసం నిధులు తేవడం ఒక ఎత్తు అయితే, తన వ్యక్తిగత ఆదాయాన్ని ప్రజల కోసం ఖర్చు చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం మరో ఎత్తు. పిఠాపురం ప్రజల పట్ల ఆయన చూపిస్తున్న ఈ వాత్సల్యం, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ఒక ఆత్మీయ అనుబంధంగా మారుతోంది.

కాల్చిన మొక్కజొన్న తింటున్నారా? ఒక్కసారి ఈ విషయాలు తెలుసుకోండి.

వర్షాకాలంలో వేడివేడి కాల్చిన మొక్కజొన్న తినడం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది కదా! కానీ, దీని వెనుక దాగి ఉన్న ఆరోగ్య ప్రయోజనాలు మీకు తెలుసా? కాల్చిన మొక్కజొన్నలో పుష్కలంగా ఉండే పోషకాలు మన శరీరానికి ఎన్నో మేలు చేస్తాయి. ఇది పౌష్టికమైన ఆహారంగా మాత్రమే కాకుండా, రుచికరమైన తినుబండారంగా కూడా ప్రసిద్ధి చెందింది. ఇది విటమిన్లు, ఖనిజాల కలయికతో అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. 1. అధిక మోతాదులో ఫైబర్ కాల్చిన మొక్కజొన్నలో మేలైన పీచ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపడంలో కూడా ఇది సహాయపడుతుంది. దీనిలో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను నివారిస్తుంది. "పొట్టు మినపప్పును పక్కన పెట్టేస్తున్నారా? అయితే ఎంత నష్టపోతున్నారో తెలుసా?" 2. హృదయ ఆరోగ్యానికి మేలు ఇందులో ఉండే మంచి కొవ్వులు, ఫైటోన్యూట్రియెంట్లు రక్తనాళాల కాఠిన్యాన్ని తగ్గిస్తాయి. ఇది హృదయ సంబంధ సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. మొక్కజొన్నలో ఉన్న సహజ కార్బోహైడ్రేట్లు శరీరానికి వెంటనే శక్తిని అందిస్తాయి. ఇది ప్రత్యేకంగా శారీరకంగా శ్రమ చేసే వారికి ఎంతో ఉపయోగకరం. 3. యాంటీ ఆక్సిడెంట్లు మొక్కజొన్నలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను నిరోధించి, వృద్ధాప్యాన్ని ఆలస్యం చేస్తాయి. చర్మానికి ఆరోగ్యకరమైన కాంతి అందించడంలో కూడా ఇది సహాయపడుతుంది. కాల్చిన మొక్కజొన్నలో కాల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు ఉన్నాయి. ఇవి ఎముకలను బలంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. 4. రోగ నిరోధక శక్తి పెంపు కాల్చిన మొక్కజొన్నలో విటమిన్ సి (ఎతిబిజీఎతిని అ) ఎక్కువగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను బలపరచడంలో సహాయపడుతుంది. దీనిలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటుంది. ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. షుగర్ రోగులు దీన్ని మితంగా తీసుకుంటే లాభపడతారు. "పొట్లకాయ తిన్న తర్వాత తినకూడని ఆహారాలు.. పొరపాటున తిన్నారో..?"వారి గుడిలో గందరగోళం సృష్టించిన దుండగులు.. కఠినంగా శిక్షించాలని డిమాండ్ । ానివతినిటతిజీ 5. బరువును అదుపులోకి కాల్చిన మొక్కజొన్నలో తక్కువ కేలరీలు ఉంటాయి. ఇది పొట్ట నిండిన భావనను కలిగిస్తే, బరువు తగ్గే ప్రణాళికలో ఉన్నవారికి ఇది సరైన ఆహారంగా మారుతుంది. అయితే వీటిని మితంగానే తీసుకోవడం ఆరోగ్యకరం. కానీ కొన్నిసార్లు మొక్కజొన్న తిన్నప్పుడు పీచు మోతాదుతో జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. కాల్చిన మొక్కజొన్న పౌష్టిక విలువలతో నిండిపోయి ఉంటుంది. ఇది ఆరోగ్యం మెరుగుపరచడంలో, రోగ నిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. జ్యూసులు, స్నాక్స్ స్థానంలో కాల్చిన మొక్కజొన్నను తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఉత్తమ ఎంపిక. మొక్కజొన్నను పిండి చేసి, దోసెలు, ఇడ్లీలు తయారు చేయవచ్చు.

పొట్టు మినపప్పును పక్కన పెట్టేస్తున్నారా? అయితే ఎంత నష్టపోతున్నారో తెలుసా?



పొట్టు మినపప్పు, అనగా గింజ తొక్క తొలగించకుండా ఉంచిన మినపప్పు. ఈ పొట్టు మినపప్పు కు భారతీయ ఆహారంలో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ఇది ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే పప్పులలో ఒకటిగా గుర్తించబడింది. పప్పుల శ్రేణిలో రుచికరమైన వంటకాలకు ఇది వాడుతారు. ఇది పోషక పదార్థాల్లో సమృద్ధిగా ఉండి ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహాయప డుతుంది. సంప్రదాయ వంటకాలలో దీనికి విశేష స్థానం ఉంది. పొట్టు మినపప్పులో ఉండే పోషకాలు శరీర కండరాల అభివృద్ధి కోసం అత్యవసరమైన ప్రోటీన్లు సమృద్ధిగా ఉన్నాయి. జీర్ణశక్తి కోసం దీనిలో ఉన్న ఆహార ఫైబర్ ఉపయోగపడుతుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. దీనిలో ఉండే క్యాల్షియం, మెగ్నీషియం, ఎముకల ఆరోగ్యానికి పెంపొ ందిస్తాం యి.ముఖ్యంగా ః విటమిన్లు, శక్తిని అందించడంలో, మెదడు కార్యకలాపాలను పెంపొం దించడంలో తొడ్పడతాయి. గాల్‌బ్లాడర్‌లో స్టోన్స్ ఎందుకు ఏర్పడతాయి..? సర్జరీ తప్పనిసరా..?" పొట్టు మినపప్పు ప్రయోజనాలు 1. జీర్ణశక్తి మెరుగుదల పొట్టు మినపప్పులో ఫైబర్ అధికంగా ఉండడం వలన జీర్ణవ్యవస్థ సజావుగా పనిచేస్తుంది. పేగుల్లో వ్యర్థాలను సులభంగా బయటకు పంపే విధంగా ఇది సహాయపడుతుంది. 2. రక్తహీనత నివారణ ఐరన్ అధికంగా ఉండటం వలన రక్తహీనత సమస్యతో బాధపడే వారికి ఇది మంచిదిగా పనిచేస్తుంది. గర్భిణీ స్త్రీలు కూడా దీనిని తీసుకోవడం వల్ల ఉపయోగాలు పొందవచ్చు. 3. శక్తి పెంపొందిస్తుంది. ప్రోటీన్ ఎక్కువగా ఉండడం వలన శక్తి వినియోగానికి, కండరాల బలవృద్ధికి ఉపయోగపడుతుంది. క్రమం తప్పకుండా పొట్టు మినపప్పు వాడటం వలన శరీరం శక్తివంతంగా ఉంటుంది. "దోసకాయ తింటున్నారా? అయితే ఇవి తెలుసుకోండి!" 4. చర్మ ఆరోగ్యం పొట్టు మినపప్పులో ఉండే పోషకాల వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. ఇది చర్మ కణాల పునరుద్ధరణకు సహాయపడుతుంది. ఇందులో ఉన్న కల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు ఎముకల పటుత్వానికి పెంపొందిస్తాయి. 5. రక్తపోటు నియంత్రణ పొట్టు మినపప్పులో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అంతే కాకుండా పొట్టు మినపప్పులో ఉండే బి-విటమిన్లు , ఇతర ఖనిజాలు మెదడు ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. 6. హృదయ ఆరోగ్యం ఫైబర్ అధికంగా ఉండటం వలన పొట్టు మినపప్పు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది హృదయ సంబంధిత వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. "మతిమరుపును తగ్గించే ఆయుర్వేద మూలికలు.. తరచూ తీసుకుంటే..?" ఎలా వాడాలి. పొట్టు మినపప్పును గారెలు, దోశలు వంటి వంటకాలలో వాడవచ్చు. రోజువారీ భోజనంలో చిన్న పరిమాణంలో తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే పొట్టు మినపప్పు వల్ల కలిగే నష్టాలు కూడా ఉన్నాయి. కొంతమందికి పొట్టు మినపప్పు జీర్ణించుకోవడం కష్టంగా ఉంటుంది. మరికొందరికి అలర్జీ కలిగించవచ్చు. ఏది ఏమైనా గాని క్రమం తప్పకుండా పొట్టు మినపప్పును ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

మొటిమలు గిల్లుతున్నారా..?అయితే జరిగేది ఇదే..!

మొటిమలు అనేది చర్మంపై ఏర్పడే చిన్న చిన్న గుండ్రని గడ్డలు. ఇవి చాలా సాధారణమైన చర్మ సమస్య.మొటిమలు ఎందుకు వస్తాయి?మొటిమలు చర్మంపై ఉన్న చిన్న రంధ్రాలు (రోమ కుదుళ్ళు) మూసుకుపోయినప్పుడు ఏర్పడతాయి. ఈ రంధ్రాలలో సేబం అనే నూనె ఉత్పత్తి అవుతుంది. అదనపు సేబం మరియు చనిపోయిన చర్మ కణాలు కలిసి రంధ్రాలను మూసివేస్తాయి. ఈ మూసుకుపోయిన రంధ్రాలలో బ్యాక్టీరియా పెరిగి, మొటిమలు ఏర్పడతాయి. అవి ఎంత బాధించినా వాటిని గిల్లడం మంచిది కాదు. ఎందుకంటే మొటిమలు గిల్లితే చాలా సమస్యలు వస్తాయి. మొటిమలు గిల్లడం వల్ల వచ్చే నష్టాలు: మొటిమలు గిల్లితే చర్మం లోపలికి బ్యాక్టీరియా వెళ్లి ఇన్ఫెక్షన్ అవుతుంది. దీంతో మొటిమలు మరింత పెరిగి, నొప్పి ఎక్కువగా అవుతుంది.మొటిమలు గిల్లితే మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు కొన్నిసార్లు శాశ్వతంగా ఉండిపోతాయి.మొటిమలను గిల్లితే చర్మం లోపల జలుబు గడ్డలు ఏర్పడతాయి. ఇవి తొలగించడం కష్టం.మొటిమలు గిల్లితే మొటిమల సంఖ్య పెరుగుతుంది. ఇది మొటిమల సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది.మొటిమలు గిల్లితే చర్మం మీద చిన్న చిన్న గుంటలు ఏర్పడతాయి. ఇవి చర్మాన్ని ముడతలు పడేలా చేస్తాయి.మొటిమలు వల్ల ఇప్పటికే ఆత్మవిశ్వాసం తగ్గి ఉంటుంది. వాటిని గిల్లితే మరింత బాధపడతారు. " లోదుస్తులు ధరించి పడుకుంటే అంతే సంగతి..!" మొటిమలను ఎలా నిర్వహించాలి? రోజుకు రెండుసార్లు మంచి ఫేస్ వాష్‌తో ముఖం కడుక్కోవాలి.చాక్లెట్లు, కొవ్వు ఆహారం, ఫాస్ట్ ఫుడ్ తినడం తగ్గించాలి.నీరు శరీరంలోని టాక్సిన్స్‌ను బయటకు పంపిస్తుంది.ఎండలో వెళ్ళేటప్పుడు సన్‌స్క్రీన్ వాడాలి.తగినంత నిద్ర చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.మొటిమల సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి.మొటిమలు గిల్లడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. బదులుగా చాలా నష్టాలు వస్తాయి. కాబట్టి మొటిమలను గిల్లకుండా ఉండటానికి ప్రయత్నించాలి.

చికెన్ పచ్చడి తింటున్నారా..?



చికెన్ పచ్చడి అంటే తెలుగు వారికి పండుగే! రుచికరమైన చికెన్ ముక్కలు, వేడి మసాలాల కలయిక, ఇంకొంచెం పులుపు – ఇదంతా కలిసి ఒక అద్భుతమైన రుచిని కలిగిస్తుంది. అన్నం, రోటీతో పాటు, ఇది ఎలాంటి భోజనానికి అయినా ఒక అద్భుతమైన అనుబంధం. అంతేకాకుండా, ఇది చాలా రోజులు నిల్వ ఉంటుంది కాబట్టి, ముందుగానే తయారు చేసి పెట్టుకోవచ్చు.అయితే చికెన్ పచ్చడి వల్ల కొన్ని ఆరోగ్య నష్టాలు కూడా ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చికెన్ పచ్చడి తినడం వల్ల వచ్చే నష్టాలు: చికెన్ పచ్చడిలో ఉండే నూనె, మాంసం వల్ల కేలరీలు అధికంగా ఉంటాయి. దీనిని అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు పెరిగి, బరువు పెరగడానికి దారితీస్తుంది.చికెన్ పచ్చడిలో ఉండే మసాలాలు కొంతమందికి జీర్ణ సమస్యలను కలిగిస్తాయి. ముఖ్యంగా, అజీర్ణం, గ్యాస్, అల్సర్ వంటి సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా తీసుకోవాలి.కొంతమందికి చికెన్ లేదా మసాలాలకు అలర్జీ ఉండవచ్చు. అలాంటి వారు చికెన్ పచ్చడిని తీసుకోవడం వల్ల చర్మం దురద, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు ఎదుర్కోవచ్చు.చికెన్ పచ్చడిలో ఉప్పు అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును పెంచి, హృదయ సంబంధమైన సమస్యలకు దారితీయవచ్చు. చికెన్ పచ్చడిలో ఉండే కొవ్వు కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుంది. ఇది గుండె జబ్బులు రావడానికి ప్రధాన కారణం. "ఊఎటవతీజీఎజీట: పుట్ట గొడుగుల బిర్యానీలో చికెన్ ముక్కలు..!" జాగ్రత్తలు: పరిమితంగా తీసుకోవాలి: చికెన్ పచ్చడిని పరిమితంగా, వారానికి కొన్ని సార్లు మాత్రమే తీసుకోవాలి.చికెన్ పచ్చడి తయారు చేసేటప్పుడు తక్కువ కొవ్వు గల చికెన్ ఉపయోగించడం మంచిది. ఉప్పును తక్కువగా వాడితే రక్తపోటు సమస్య తగ్గుతుంది.మసాలాలను తక్కువగా వాడితే జీర్ణ సమస్యలు తగ్గుతాయి. చికెన్ లేదా మసాలాలకు అలర్జీ ఉన్నవారు చికెన్ పచ్చడిని తీసుకోకూడదు. ముగింపు: చికెన్ పచ్చడి ఒక రుచికరమైన వంటకం అయినప్పటికీ, దీనిని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. కాబట్టి, ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం చికెన్ పచ్చడిని పరిమితంగా తీసుకోవడం మంచిది. గమనిక: ఈ సమాచారం కేవలం సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే, మీరు తప్పకుండా మీ వైద్యుడిని సంప్రదించాలి.

వారానికి రెండుసార్లు కన్నా ఎక్కువ తలస్నానం చేస్తున్నారా..?

తరచూ తలస్నానం చేయడం వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే అతిగా తలస్నానం చేయడం వల్ల జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది. తరచూ తలస్నానం చేయడం వల్ల కలిగే నష్టాలు: జుట్టు పొడిగా మారడం: తరచూ షాంపూ వాడటం వల్ల జుట్టులోని సహజ నూనెలు తొలగిపోయి జుట్టు పొడిగా, గరుకుగా మారుతుంది. జుట్టు రాలడం: అతిగా తలస్నానం చేయడం వల్ల జుట్టు రూట్స్ బలహీనపడి జుట్టు రాలడం పెరుగుతుంది. తల చర్మం సమస్యలు: తరచూ షాంపూ వాడటం వల్ల తల చర్మం పొడిబారడం, దురద, మొటిమలు వంటి సమస్యలు తలెత్తుతాయి. " చికెన్ పచ్చడి తింటున్నారా..?" జుట్టు రంగు మారడం: కొంతమందిలో తరచూ తలస్నానం చేయడం వల్ల జుట్టు త్వరగా తెల్లబడే అవకాశం ఉంది. జుట్టుకు ప్రకాశం తగ్గడం: జుట్టులోని సహజ నూనెలు తొలగిపోవడం వల్ల జుట్టుకు ప్రకాశం తగ్గి మందంగా కనిపిస్తుంది. ఎంత తరచుగా తలస్నానం చేయాలి? జుట్టు రకం: జుట్టు పొడిగా ఉంటే వారానికి రెండు సార్లు, జిడ్డుగా ఉంటే వారానికి మూడు సార్లు తలస్నానం చేయడం సరిపోతుంది. వాతావరణం: వేసవి కాలంలో ఎక్కువగా చెమట పడుతున్నప్పుడు తరచూ తలస్నానం చేయవచ్చు. వ్యాయామం: వ్యాయామం చేసిన తర్వాత తలస్నానం చేయడం మంచిది. ముఖ్యమైన విషయాలు: షాంపూ ఎంపిక: మీ జుట్టు రకానికి తగిన షాంపూను ఎంచుకోవడం ముఖ్యం. నీటి ఉష్ణోగ్రత: వెచ్చని నీటితో తలస్నానం చేయడం మంచిది. చల్లటి నీటితో లేదా వేడి నీటితో తలస్నానం చేయడం వల్ల జుట్టుకు హాని కలుగుతుంది. కండీషనర్ వాడకం: ప్రతిసారి తలస్నానం చేసిన తర్వాత కండీషనర్ వాడటం మంచిది. నూనె మర్దన: వారానికి ఒకసారి నూనె మర్దన చేయడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. ముగింపు: తలస్నానం చేయడం చాలా ముఖ్యం అయినప్పటికీ, అతిగా చేయడం వల్ల జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది. కాబట్టి మీ జుట్టు రకం మరియు వాతావరణాన్ని బట్టి తలస్నానం చేయడం మంచిది. "ఎవజీబీబిఎ బితిజూబ: ఈ పండ్లు తింటే వయస్సు గుర్తించలేనంత యవ్వనంగా.. నిత్య నూతనంగా.." ఈ సమాచారం కేవలం సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఏదైనా సమస్య ఉంటే తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించండి.

వీరింట 64రోజులు అదృష్టలక్ష్మి తాండవం ఖాయం చేసిన బుధుడు!

నవగ్రహాల్లో బుధ గ్రహానికి ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. గ్రహాల రాకుమారుడు గా చెప్పే బుధుడు అత్యంత శక్తివంతమైన గ్రహం. ప్రస్తుతం వృశ్చిక రాశిలో కొనసాగుతున్న బుధుడు జనవరి 4వ తేదీ వరకు వృశ్చిక రాశిలోనే సంచారం చేస్తూ కొన్ని రాశుల వారికి అఖండ ధన యోగాన్ని వరంగా ఇస్తున్నాడు. 64 రోజులు బుధ సంచారం సహజంగా ఏ రాశిలో అయినా మూడు వారాలకు మించి సంచరించని బుధుడు ఈసారి వృశ్చిక రాశిలో 64 రోజులు పాటు సంచారం చేస్తున్నాడు. దీంతో కొన్ని రాశుల వారికి ఊహించని ప్రయోజనాలను ఆర్థిక లాభాలను కలిగిస్తున్నాడు . జనవరి నాలుగో తేదీ వరకు బుధ సంచారంతో అదృష్టం కలిసి వచ్చే ఆ రాశులు ఏమిటో ప్రస్తుతం మనం తెలుసుకుందాం. "కొత్త సంవత్సరంలో పులి పంజాను చీల్చి కోటీశ్వరులయ్యే రాశులు వీరే" వృషభరాశి వృషభ రాశి వారికి వృశ్చిక రాశిలో బుధ గ్రహ సంచారం కలిసివస్తుంది. జనవరి 4వ తేదీ లోపు వృషభ రాశి వారికి శుభ ఫలితాలు రానున్నాయి. ఆర్థిక సమస్యల నుంచి విముక్తి లభించడమే కాకుండా వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలో పురోగతి కనిపిస్తుంది. పెళ్ళికాని వారికి వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. కర్కాటక రాశి కర్కాటక రాశి వారికి వృశ్చిక రాశిలో బుధ సంచారం అదృష్టాన్ని ఇస్తుంది. కర్కాటక రాశి జాతకులకు ఆస్తి, గృహ సంబంధిత విషయాలలో వివాదాలు పరిష్కారం అవుతాయి. వర్తక వ్యాపారాలు చేసే వారికి ఆర్థిక లాభాలు వస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. కొత్త వ్యక్తులతో పరిచయాలు మీకు మంచి ఫలితాలను ఇస్తాయి. ఉద్యోగ జీవితం ప్రయోజనకరంగా ఉంటుంది.

స్పోర్ట్స్ న్యూస్

గౌతమ్ గంభీర్‌పై రాహుల్ ద్రావిడ్ సంచలన కామెంట్స్!

భారత జట్టు మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం టీమిండియాకు హెడ్‌కోచ్‌గా ఉన్న గౌతమ్ గంభీర్ ఆలోచనా విధానానికి తాను వ్యతిరేకమని పరోక్షంగా ప్రస్తావించాడు. అలానే టీమిండియాలో 'సూపర్ స్టార్ కల్చర్'పై కూడా స్పందించాడు. రవిశాస్త్రి తర్వాత భారత జట్టుకు మార్గనిర్దేశకుడిగా వచ్చిన ద్రవిడ్.. జట్టును విజయపథంలో నిలిపాడు.స్కూప్ పాడ్‌కాస్ట్‌లో ద్రవిడ్ మాట్లాడుతూ.. 'ప్రతీ క్రీడకు హీరోల అవసరం ఉంది. తమ ప్రదర్శనల ద్వారానే ప్లేయర్లు హీరోలుగా మారుతారు. మైదానంలో మన ప్రదర్శన బాగుంటునే ప్రేక్షకులు మనల్ని గుర్తిస్తారు.

ముఖ్యంగా భారత్‌లో అద్భుతంగా ఆడితే ఊహించని స్థాయిలో ప్రశంసలు వస్తాయి. ప్రదర్శన సరిగ్గా లేకుంటే విమర్శలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. అందరి దృష్టి ఆటగాళ్ల మీదే ఉంటుంది' అని ద్రవిడ్ తెలిపాడు.'మన ప్రదర్శనలను ప్రేక్షకులు క్షుణ్ణంగా గమనిస్తారు. కాబట్టి ఈ దేశంలో ఎంతో గొప్పగా ఆడితే తప్ప సూపర్ స్టార్ అవుతారు. లేకుంటే దిగ్గజ ప్లేయర్ అనే హోదా రాదు. వ్యక్తిగత ప్రదర్శన బాగుంటే జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన వారిమి అవుతాము. సూపర్ స్టార్లు భావితరాలకు స్ఫూర్తినిస్తారు. వారి అవసరం తప్పక ఉంది' అని ద్రవిడ్ అభిప్రాయపడ్డాడు. కాగా గంభీర్ సూపర్ స్టార్ ట్యాగులు వద్దంటూ అందరినీ ఒకే గాటన కట్టాలని చూస్తుంటే.. ద్రవిడ్ మాత్రం ఈ మేరకు స్పందించడం గమనార్హం.ద్రవిడ్ మార్గనిర్దేశనంలో భారత్ వన్డే వరల్డ్‌కప్-2023 ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. ద్రవిడ్ నిష్క్రమణ తర్వాత గంభీర్ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతడి ఆధ్వర్యంలోనే టీమిండియా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025, టీ20 ప్రపంచకప్ 2026 టైటిల్ గెలిచింది. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో ద్రవిడ్‌దే కీలక పాత్ర అని, అతడు నిర్మించిన జట్టే టైటిల్ గెలిచిందని అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ ద్రవిడ్‌కు క్రెడిట్ ఇచ్చాడు. మరోవైపు టెస్టు ఫార్మాట్ నుంచి దిగ్గజాలు, సూపర్ స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వారం వ్యవధిలోనే వైదొలగడంతో గంభీర్‌తో విభేదాలే కారణమనే వార్తలు వచ్చాయి.

ఇషాన్ కిషన్‌కు రూ. కోటి నజరానా

టీమిండియా స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌ను బిహార్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించిన ఇషాన్‌కు.. బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరీ రూ.కోటి నజరానా ప్రకటించారు. సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఇషాన్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సమ్రాట్ చౌదరీ సోషల్ మీడియాలో ఫోటోలు పంచుకున్నారు.అనివార్య కారణాల వల్ల ఇషాన్ కిషన్ చాలా కాలం భారత జట్టుకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. దేశవాళీ క్రికెట్‌లో రీఎంట్రీ ఇచ్చి.. అక్కడ అద్భుతంగా రాణించి టీమిండియాలో తిరిగి చోటు సంపాదించుకున్నాడు. టీ20 ప్రపంచకప్‌కు ముందు జట్టులో చేరాడు. టోర్నీలో అద్భుత ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకున్నాడు. మొత్తం తొమ్మిది మ్యాచ్‌ల్లో 317 పరుగులు చేసి భారత్ తరఫున రెండో అత్యధిక రన్స్ సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. ప్రత్యేకంగా పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో 40 బంతుల్లో 77 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్నాడు. ఫైనల్‌లో 25 బంతుల్లోనే 54 పరుగులు చేశాడు. ఫైనల్ మ్యాచ్‌కు ముందురోజు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన తన కజిన్ సిస్టర్‌కు ఆ విజయాన్ని అంకితం ఇచ్చాడు. ప్రస్తుతం ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతున్న ఇషాన్.. 12 మ్యాచ్‌ల్లో 420 పరుగులు చేసి మంచి ఫామ్‌లో కొనసాగుతున్నాడు.

ప్లే ఆఫ్స్‌కు ముందు కేకేఆర్‌కు షాక్.. ఐపీఎల్‌ను వీడిన రచిన్ రవీంద్ర

ఐపీఎల్ 2026 కీలక దశకు చేరుకుంది. మే 24తో లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు ముగియనున్నాయి. ప్లే ఆఫ్స్ బెర్తుల కోసం పోటీ రసవత్తరంగా మారిన నేపథ్యంలో.. కేకేఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టు కీలక ప్లేయర్ రచిన్ రవీంద్ర ఐపీఎల్‌ను వీడాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు సిద్ధమవ్వడం కోసం రచిన్ న్యూజిలాండ్‌కు తిరిగి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని కేకేఆర్ ఫ్రాంచైజీ ఎక్స్ వేదికగా అధికారికంగా ప్రకటించింది.'న్యూజిలాండ్-ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్ జరగనుంది. దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు రచిన్ రవీంద్ర స్వదేశానికి తిరిగి వెళ్లాడు' అని ఫ్రాంచైజీ పేర్కొంది. మే 27 నుంచి న్యూజిలాండ్.. ఐర్లాండ్‌తో ఏకైక టెస్టు, జూన్ 4 నుంచి ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఇందులో రచిన్ రవీంద్ర పాల్గొననున్నాడు. శనివారం కోల్‌కతా జట్టు గుజరాత్ టైటాన్స్‌తో తలపడనున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఈ సీజన్ వేలంలో కేకేఆర్ ఫ్రాంచైజీ అతడిని రూ.2 కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అయితే జట్టులో గ్రీన్ వంటి విదేశీ ప్లేయర్లు ఆడుతుండటంతో రచిన్‌కు ఈ సీజన్‌లో బ్యాటింగ్ చేసే అవకాశం దక్కలేదు. ఐపీఎల్ ప్లే ఆఫ్స్ రేసు ఉత్కంఠగా మారుతున్న తరుణంలో రచిన్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు.ఈ సీజన్‌లో కేకేఆర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన ఆ జట్టు నాలుగు విజయాలు మాత్రమే నమోదు చేసింది. ఆరు మ్యాచ్‌ల్లో ఓడిపోయి, ఒక మ్యాచ్ ఫలితం లేకుండా ముగిసింది. ప్రస్తుతం తొమ్మిది పాయింట్లతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది.

కెప్టెన్‌గా సంజు టీమిండియాను ఉత్తమంగా నడిపించగలడు: రవి శాస్త్రి

టీమిండియా స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ సంజు శాంసన్ ప్రస్తుతం అద్భుత ప్రదర్శనలతో అదరగొడుతున్నాడు. టీ20 ప్రపంచ కప్ 2026 ట్రోఫీని భారత జట్టు గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ మెగా టోర్నీలో అత్యధిక పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తోన్న సంజు.. ఇప్పటికే రెండు సెంచరీలు చేసి అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడు. ఈ నేపథ్యంలో సంజు శాంసన్ భవిష్యత్తుపై టీమిండియా దిగ్గజం రవి శాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశాడు. టీ20 జట్టుకు సంజు కీలక పోటీదారుగా ఉన్నాడని అభిప్రాయపడ్డాడు.'భారత్ రెండేళ్ల తర్వాత టీ20 ప్రపంచ కప్ ఆడనుంది. అందుకోసం తప్పకుండా కొత్త సారథిని చూడాల్సిన అవసరం ఉంటుంది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్ పరంగా జట్టును అద్భుతంగానే నడిపిస్తున్నాడు. కానీ బ్యాటర్‌గా ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. అయితే వచ్చే ప్రపంచ కప్‌కు సూర్య కెప్టెన్‌గా కొనసాగడంపై సందిగ్ధత నెలకొంది. ఈ జాబితాలో సంజు శాంసన్ ముందుంటాడు. ఇప్పటికే అతడికి రాజస్థాన్ రాయల్స్‌ను నడిపించిన అనుభవం ఉంది. ఓపెనర్‌గా విధ్వంసకర బ్యాటింగ్ చేసే సంజు.. కెప్టెన్‌గానూ జట్టును ఉత్తమంగా నడిపించగలడు. వచ్చే రెండేళ్లలో అతడి నుంచి అత్యుత్తమ ఆటతీరును చూడబోతున్నాం' అని రవిశాస్త్రి తెలిపాడు.'సంజు శాంసన్ బ్యాటింగ్‌లో నిలకడ ఉండదని చాలామంది భావిస్తారు. గతంలో అతడికి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదని చెబుతుంటారు. కానీ, ఆటతీరు పరంగా అతడి విషయంలో ఎలాంటి సందేహాలు అక్కర్లేదు. కొన్నిసార్లు అనుకున్నంత స్థాయిలో ఆడలేకపోయినా.. అతడి నైపుణ్యం అద్భుతం. టీ20 ప్రపంచ కప్ 2026లో ఒంటిచేత్తో మ్యాచ్‌లు గెలిపించాడు. ఇప్పుడు ఐపీఎల్‌లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడు. తన ఆటతో కెప్టెన్సీ పోటీలో ఉన్నానని చెప్పకనే చెప్పాడు' అని రవి శాస్త్రి వెల్లడించాడు.

పాకిస్థాన్‌కు బిగ్ షాక్.. డబ్ల్యూటీసీలో ఏకంగా 8 పాయింట్లు కోత..!

బంగ్లాదేశ్ పర్యటనలో దారుణ ఓటమిని మరిచిపోకముందే పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఢాకా టెస్టులో స్లో ఓవర్ రేటుకు పాక్ భారీ మూల్యం చెల్లించుకుంది. మ్యాచ్ ఫీజులో కోతతో పాటు ఆ జట్టు ర్యాంకింగ్‌లోనూ దిగజారింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో కీలకమైన పాయింట్లు కోల్పోయింది. ఒకటి రెండు కాదు ఏకంగా 8 పాయింట్లు కోతకు గురైంది షాన్ మసూద్ బృందం.ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో పాకిస్థాన్‌కు ఊహించని షాక్. బంగ్లాదేశ్ చేతిలో 104 పరుగుల తేడాతో తొలి టెస్టులో ఓటమి పాక్ ర్యాంకింగ్స్‌ను దెబ్బతీసింది. ఆ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా మ్యాచ్ ఫీజులో 40 శాతం కోల్పోయింది. నిర్ణీత సమయానికి ఎనిమిది ఓవర్లు వెనుకంజలో ఉండడంతో జరిమానా కింద డబ్ల్యూటీసీలో 8 పాయింట్ల కోత పడింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. న్యూజిలాండ్ రెండులో ఉంది. దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్ వరసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి.ఢాకా వేదికగా జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్లను వణకిస్తూ బంగ్లాదేశ్ భారీ విజయాన్నందుకుంది. దమ్ముంటే మా ముందు 70 ఓవర్లలో 260పైగా లక్ష్యాన్ని నిర్దేశించండి అని సవాల్ విసిరిన సల్మాన్ అఘా తల పొగరను అణచివేస్తూ సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది.మొదటి ఇన్నింగ్స్‌లో కాస్తో కూస్తో పోరాడిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుప్పకూలింది. నహిద్ రాణా(5-40) బంతితో చెలరేగిన వేళ బంగ్లా 104 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా స్వదేశంలో పాక్‌పై బంగ్లాదేశ్ మొదటి విజయంతో చరిత్ర సృష్టించింది. ఇరుజట్ల మధ్య మే 16 నుంచి రెండో టెస్టు జరుగనుంది.

పంజాబ్‌కు షాకిచ్చిన ముంబై.. రికీ పాంటింగ్‌తో ప్రీతి జింతా సుదీర్ఘ చర్చ

ధర్మశాల: ఐపీఎల్‌లో భాగంగా గురువారం ధర్మశాలలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. అనూహ్య రీతిలో పంజాబ్ కింగ్స్ జట్టు ఓటమి పాలైంది. ముంబై బ్యాటర్ తిలక్ వర్మ స్టన్నింగ్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత పంజాబ్ కింగ్స్ ఓనర్ ప్రీతీ జింతానిర్సుత్సాహాని లోనయ్యారు. ఆమె కొంత ఆందోళనలో ఉన్నట్లు కనపించారు. పంజాబ్ జట్టు హెడ్ కోచ్ రికీ పాంటింగ్‌తో మైదానంలో చాలా సేపు చర్చించారు. ఇద్దరూ మాట్లాడుకుంటున్న సందర్భం కెమెరాకు చిక్కింది.వాస్తవానికి ఫస్ట్ హాఫ్ సీజన్‌లో పంజాబ్ దూకుడుగా ఆడింది. ప్లే ఆఫ్స్ ఆశలు ఉండేవి. కానీ వరుసగా అయిదో మ్యాచ్ ఓడిపోవడంతో శ్రేయాస్ అయ్యర్ జట్టుకు ఇప్పుడు ప్లే ఆఫ్స్ అవకాశం కష్టంగా మారింది. ప్రస్తుతం పంజాబ్ జట్టు 12 మ్యాచుల్లో 13 పాయింట్లు సాధించింది. అయితే ప్లే ఆఫ్స్ రేసు కోసం చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు కూడా దూసుకొస్తున్నాయి. ముంబైతో మ్యాచ్ తర్వాత డగౌట్ ఏరియాలో పాంటింగ్‌తో ప్రీతీ జింతా ముచ్చటపెట్టారు.మ్యాచ్ జరుగుతున్న సమయంలో పాంటింగ్ కూడా బౌండరీ లైన్ వద్దే నిలుచుని పంజాబ్ ఆటగాళ్లను ప్రోత్సహించాడు. కానీ 200 పరుగుల స్కోరును డిఫెండ్ చేసుకోలేకపోయింది. సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా లాంటి ప్లేయర్లు లేకున్నా.. ముంబై జట్టు విజయాన్ని నమోదు చేసింది. తిలక్ వర్మ తన పవర్ గేమ్‌తో ఆకట్టుకున్నాడు. 33 బంతుల్లో అతను 75 రన్స్ చేశాడు. దాంట్లో ఆరు సిక్సర్లు, ఆరు బౌండరీలు ఉన్నాయి. వాస్తవానికి ప్లే ఆఫ్స్‌కు ఏమాత్రం దగ్గరలో లేని ముంబై జట్టు తన విక్టరీతో పంజాబ్‌ను మరింత కష్టాల్లోకి నెట్టేసింది.

తిలక్ వర్మపై అర్షదీప్ కామెంట్.. పంజాబ్ బౌలర్‌పై ఆన్‌లైన్‌లో విమర్శలు

ధర్మశాల: క్రికెటర్ అర్షదీప్‌పై ఆన్‌లైన్‌లో విమర్శలు వస్తున్నాయి. ముంబై బ్యాటర్ తిలక్ వర్మపై పంజాబ్ బౌలర్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. హోటల్‌లో జరిగిన ఈ ఘటనకు చెందిన వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఉంది. అటుగా వెళ్తున్న తిలక్ వర్మను ఓయ్ అందేరా అంటూ అర్షదీప్ పిలిచాడు. ఆ ఇద్దరు కాసేపు సరదగా మాట్లాడుకున్నారు. కానీ అర్షదీప్ తన పిలుపులో వర్ణవివక్ష చూపినట్లు ట్రోలర్స్ ఆరోపిస్తున్నారు. ఓయ్ నల్లనోడా అంటూ అర్షదీప్ వర్ణవివక్ష కామెంట్ చేశారని ఇంటర్నెట్‌లో యూజర్లు ఆరోపిస్తున్నారు. అర్షదీప్ వాడిన పదజాలం పట్ల అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి వ్లాగ్స్, రీల్స్‌లో అర్షదీప్ ఎప్పుడూ ఏవో వీడియోలు షేర్ చేస్తూనే ఉంటాడు. అయితే అర్షదీప్, తిలక్ మధ్య జరిగిన సంభాషణపై మాత్రం క్రికెట్ అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కురుప్పు విడుదలకు ముందే ఇబ్బందులు

చివరి నిముషంలో షోలు రద్దు

తమిళ స్టార్ హీరో సూర్య నటించిన తాజా చిత్రం కరుప్పు విడుదలకు ముందే అనూహ్య ఇబ్బందుల్లో చిక్కుకుంది. దర్శకుడు ఆర్జే బాలాజి తెరకెక్కించిన ఈ సినిమాను తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. త్రిష కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం మే 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో షోలు రద్దు కావడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు. షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం నుంచే థియేటర్లలో షోలు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ విడుదలకు ముందు ఆర్థికపరమైన చిక్కులు తలెత్తడంతో మార్నింగ్ షోలు నిలిచిపోయినట్లు సమాచారం. తమిళనాడులో ప్రత్యేక షోలకు అనుమతులు వచ్చినప్పటికీ, అవి కూడా రద్దు కావడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న విజయ్ ప్రభుత్వం ఉదయం 9 గంటల స్పెషల్ షోలకు పర్మిషన్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత కూడా ఒక్క షో పడకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. బుక్‌మైషోలో ఉదయం ఆటలకు సంబంధించిన బుకింగ్స్ కనిపించకపోవడంతో పాటు, తెలుగు రాష్ట్రాల్లో కూడా పలు థియేటర్లలో మార్నింగ్ షోలు క్యాన్సిల్ అయ్యాయి. మ్యాట్నీ షోల బుకింగ్స్ కూడా రద్దు చేసినట్లు సమాచారం. ఓవర్సీస్‌లో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అమెరికాలో ప్రీమియర్ షోలు నిలిపివేయడంతో పాటు, వీకెండ్ బుకింగ్స్‌పై కూడా అనిశ్చితి నెలకొంది. దీంతో సినిమా రిలీజ్‌పై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాలపై నిర్మాత ఎస్ఆర్ ప్రభు సోషల్ మీడియాలో స్పందించారు. 'అనివార్య కారణాల వల్ల ఉదయం 9 గంటల ప్రదర్శనలు రద్దు చేయబడ్డాయి. అందరికీ మా హృదయపూర్వక క్షమాపణలు' అంటూ ట్వీట్ చేశారు. అయితే తదుపరి షోలు ఎప్పుడు ప్రారంభమవుతాయన్న విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ సినిమాకు సంబంధించి నిర్మాతల పాత బకాయిలే ప్రస్తుతం సమస్యలకు కారణమయ్యాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

మైసా కోసం రష్మిక ప్రత్యేక ట్రైనింగ్

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే

శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక వవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం రష్మిక ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా కేరళలో జరిగిన షెడ్యూల్‌లో కీలకమైన స్టంట్స్‌ను చిత్రీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

విరోష్ జోడీ..యాడ్‌కు విశేష స్పందన

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జోడీ మరోసారి సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టించింది. అభిమానులు ప్రేమగా 'విరోష్' అని పిలుచుకునే ఈ జంట తాజాగా కలిసి చేసిన ఎయిర్‌బీఎన్‌బీ కపుల్ యాడ్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో రికార్డు స్థాయిలో స్పందన అందుకుంటోంది. ఈ యాడ్ పోస్టుకు ఇప్పటికే 9.1 మిలియన్లకు పైగా లైక్స్ రావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక లైక్స్ సాధించిన యాడ్ పోస్టుల్లో ఇది రెండో స్థానంలో నిలిచినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే.. మొదటి స్థానంలో కూడా విజయ్-రష్మిక జంటే ఉండటం అభిమానులను మరింత ఆనందం కలిగిస్తుంది. గతంలో ఈ జంట కలిసి చేసిన మాన్యవార్ వెడ్డింగ్ క్యాంపెయిన్ యాడ్ సోషల్ మీడియాలో భారీ రికార్డులు సృష్టించింది. ఆ యాడ్ పోస్టుకు 11.5 మిలియన్లకు పైగా లైక్స్ రావడంతో పాటు 100 మిలియన్లకు పైగా వ్యూస్ దక్కాయి. అప్పట్లో అది సోషల్ మీడియాలో పెద్ద సంచలనంగా మారింది. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజాలు లియోనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో కలిసి చేసిన లూయిస్ విట్టన్ యాడ్ పోస్టులతో పోలిస్తే.. విజయ్-రష్మిక యాడ్స్‌కు ఎక్కువ రెస్పాన్స్ రావడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ స్థాయి స్పందన రావడానికి ప్రధాన కారణం వీరిద్దరికీ ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం దర్శకుడు రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్దన్' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ రూపొందిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'లో రష్మిక మందన్నతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.

పెద్ది క్రేజ్ పెంచేలా ప్రమోషన్స్

ముంబైలో ఒకటి..భోపాల్‌లో మరో ఈవెంట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచగా.. ఇప్పుడు మేకర్స్ ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తున్నారు. 'పెద్ది' కోసం భారీ స్థాయిలో జాతీయ ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను ఎ÷-లాన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో నిర్వహించే గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ లాంచ్‌ను కేవలం సినిమా ఈవెంట్‌గా కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రచార కార్యక్రమంగా మలచాలని చిత్రబృందం భావిస్తోంది. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను ప్రత్యేకంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ట్రైలర్ లాంచ్‌తో ప్రమోషన్స్ ఆగిపోవడం లేదు. సినిమా కథలోని భారతీయ మూలాలను సెలబ్రేట్ చేసేలా మేకర్స్ మే 23న భోపాల్‌లో ప్రత్యేక సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'హార్ట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన భోపాల్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న రెహమాన్ స్వయంగా వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో ప్రత్యేక మ్యూజికల్ ప్రెజెంటేషన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖ గాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ లుక్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు పాన్ ఇండియా స్థాయిలో రెస్పాన్స్ రావడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తుండగా, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' ఇప్పటికే రికార్డుల వేట మొదలుపెట్టినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోల ప్రీ-సేల్స్‌కు భారీ స్పందన లభిస్తోందని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయనుండగా.. జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**